సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
సోమవారం, 09.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 137
పేజీలు: 12 వెల: రూ. 5

జయహో

## విశ్వవిజేతగా భారత్

టీ20 వరల్డ్ కప్ లో న్యూజిలాండ్‌పై విజయం..

పొట్టికప్పుపై తిరుగులేని ఆధిపత్యం..



*140 కోట్ల మంది భారతీయుల కళ్లలో ఆనందభాష్పాలు.. అహ్మదాబాద్ వేదికగా మరో చారిత్రక విజయం! టీ20 ప్రపంచకప్ ఫైనల్లో న్యూజిలాండ్‌ను చిత్తు చేస్తూ, సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమ్ ఇండియా విశ్వవిజేతగా నిలిచింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో తిరుగులేని ప్రదర్శనతో కివీస్‌ను మట్టికరిపించి, భారత్ మరోసారి విశ్వవేదికపై జెండా ఎగురవేసింది.* 11

## అంతర్జాతీయ నగరంగా భాగ్యనగరం

ప్రపంచంలోనే మేటి నగరంగా తీర్చిదిద్దుతాం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి 03



- మెట్రోపాలిటన్ సిటీలు ఎదుర్కొంటున్న సమస్యలు తలెత్తకుండా చర్యలు
- ప్రమాదాలకు నివారణకు పకడ్బందీ ప్రణాళికలు
- సుప్రీంకోర్టు, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల మేరకు మూసీ పునరుద్ధరణ
- గాంధీ సరోవర్ ప్రాజెక్టుపై అనవసర రాద్ధాంతం
- డిసెంబర్ నాటికి వందశాతం ఈవీ బస్సులు
- 2 లక్షల ఆటోలను ఈవీలుగా మార్చబోతున్నాం

## నడిగడ్డకు న్యాయం ఎప్పుడు?




### 14 ఎకరాల భూమిపై 50 ఏళ్ల పోరాటం

- సర్వే నెం.28లో 50 ఏళ్లుగా కొనసాగుతున్న భూమి వివాదం
- కేవలం 14.22 ఎకరాలపై 800 గిరిజన కుటుంబాల భవిష్యత్తు
- భూమి విలువ పెరగడంతో వివాదం జటిలం
- 291 ఎకరాల్లో మిగిలింది కేవలం 25 ఎకరాలే
- ఎనిమీ ప్రాపర్టీగా కేంద్ర ఆధీనంలో ఉన్న భూమిపై హక్కుల పోరాటం
- సీఆర్పీఎఫ్ క్యాంప్ – గిరిజనుల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు
- 2016లో కలెక్టర్ నివేదిక ఇచ్చినా పరిష్కారం కాని సమస్య
- ఓట్ల రాజకీయాల్లో చిక్కుకున్న నడిగడ్డ తండా గిరిజనుల సమస్య
- వసతులు ఉన్నా అధికారిక పట్టాలు లేని ఇళ్లు
- కమిషన్లు, నాయకులను కలిసినా ఫలితం లేని గిరిజనుల ప్రయత్నాలు
- రాబోయే ఎన్నికలలోనైనా నడిగడ్డ తండాకు పరిష్కారం దొరుకుతుందా?
- నడిగడ్డ మరో వెలుగుమట్లగా మారుతుందా?

**ముద్ర, శేరిలింగంపల్లి:**

మియాపూర్ భాగ్యనగరానికి ఓ నయా 'పూల్'. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆ ప్రాంతానికి యమ క్రేజ్. మియాపూర్ ప్రాంతంలో నివాసముంటున్నామంటే అదో బ్రాండ్‌గా ఫీలవుతారు. రాష్ట్ర విభజన తరువాత ఆ ప్రాంతానికి కొంచెం క్రేజ్ తగ్గినా ఇళ్లు, ఇళ్ల స్థలాలకు డిమాండ్ మాత్రం తగ్గలేదు. ఆ ప్రాంతంలో ఏర్పడిన పరిశ్రమలే డిమాండ్ ఏర్పడటానికి కారణంగా చెబుతారు. పరిశ్రమలు ఏర్పడటంతో అన్నింటికీ ప్రాధాన్యత పెరిగింది. కార్మికులు, కర్షకులు, వ్యాపారులు, ఉద్యోగులు, పెట్టుబడిదారులు మొహరించడం.. ఫలితంగా భూముల ధరలు రెక్కలు వచ్చాయి. ఉపాధి కోసం వచ్చిన వేలాది మంది కార్మికులు, హరిజన, గిరిజన కుటుంబాలు తమకు కన్పించిన చోటల్లా గుడిసెలు వేసుకుని జీవనం సాగించడం మొదలు పెట్టారు. సంవత్సరాలు గడుస్తున్నా కొద్ది గుడిసెలు, పక్కా ఇళ్లుగా మారడం.. వాటిల్లో నివాసముండే 'మాస్' ఓటర్లే గెలుపోటములను ప్రభావితం చేయడం... మాస్ ఓటర్లు వేసుకున్న షెడ్లను తొలగించబోమని భీష్మించడంతో సమస్య జటిలం అవడానికి కారణమయ్యాయి. సీఆర్పీఎఫ్ సైతం భీష్మించుకు కూర్చుంది. దీంతో ఈ భూవివాదం ఇప్పుడు రాజుకుంది. మియాపూర్ నడిగడ్డ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల కానుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మిగతా 02లో




## పైరవీల సంస్కృతికి చరమగీతం పాడాలి


**కేంద్ర మంత్రి బండి సంజయ్**

- డబ్బులు ఇస్తేనే సెలెక్షన్ అనే దుస్థితిపై ఆగ్రహం
- దశాబ్ద కాలానికి కేంద్రం ఖేలో ఇండియా మిషన్ ఏర్పాటు
- కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఘనంగా ముగిసిన ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ ఉత్సవాలు

03

## ఇరాన్ సరికొత్త యుద్ధ వ్యూహం

**ఆయుధాల కంటే ఆర్థిక అస్త్రమే మిన్న**



- ప్రపంచ దేశాలను ఒత్తిడిలోకి నెట్టే లక్ష్యంగా ఇరాన్ పావులు
- హర్మూజ్ జలసంధిని మూసివేస్తామని హెచ్చరికలు
- చమురు, సబ్‌సీ కేబుళ్లపై దాడులతో అమెరికాను కట్టడి చేసే యోచన

10



## 30 నెలల్లో పాలమూరు-రంగారెడ్డి పూర్తి

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి** 09

## అనర్హతపై చర్యలు స్పీకర్ నిర్ణయం

కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం



- స్పీకర్ విచారణ పూర్తి చేసి తీర్పును రిజర్వ్ చేశారు
- అనవసర రాద్ధాంతం, ప్రచారం ఎందుకు?

09

## హైదరాబాద్‌లో ప్రతి వారం డ్రై డే

హైదరాబాద్ ఇంచార్జి మంత్రి **పొన్నం ప్రభాకర్**



- దోమల బెడద పై సర్కార్ తక్షణ చర్యలు
- దోమల హాట్ స్పాట్ ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహిస్తూ దోమలను నివారించాలి
- ఎంటమాలజీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలి
- దోమల పెంపక స్థలాల జియోటాగింగ్ చేయాలి
- రసాయనాలు ద్వారా దోమలను నివారించాలి

**ముద్ర, హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలో ప్రతి వారం "డ్రై డే" నిర్వహిస్తూ నీటి నిల్వలు తొలగించాలని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ను ఆదేశించారు. టెమెఫోస్ రసాయనాల వినియోగం, చేపల ద్వారా లార్వా నియంత్రణ, చెరువులు, కాలువల్లో ఆయిల్ బాల్స్ విడుదల, హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ఫాగింగ్, నిర్మాణ స్థలాలు, ఓవర్ హెడ్ ట్యాంకుల మిగతా 02లో

## మాదిగ కులంపై సీఎం విమర్శ

పార్లమెంట్ లో అడుగుపెట్టొద్దనే వారికి టిక్కెట్లు ఇవ్వడం లేదు

**సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి మోత్కుపల్లి**



- అసెంబ్లీ, మండలిలోనూ వివక్ష
- వంద కార్పొరేషన్లు ఉంటే ఒక్కటే
- అపాయింట్ మెంట్ కోసం 200 సార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదు

09

## జర్నలిస్టులందరికీ గుర్తింపు కార్డులు

**సీఎం రేవంత్ రెడ్డి** 10



- డెస్క్, ఫీల్డ్ జర్నలిస్టులనే వ్యత్యాసం లేదు
- ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టు కాలనీ
- మహిళా జర్నలిస్టులకు మహిళా దినోత్సవ వేడుకలు

## అందుబాటులోకి మండలి భవనం

- చారిత్రక శాసనసభ ప్రాంగణంలో పునరుద్ధరణ
- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్, స్పీకర్ ప్రసాద్ కుమార్ సమక్షంలో కార్యక్రమం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రుల
- ప్రత్యేక పూజలు చేసిన సీఎం



*చారిత్రక శాసనసభ ప్రాంగణంలో పునరుదరించిన శాసనమండలి భవనాన్నిసీఎం రేవంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులతో కలిసి మండలి భవనాన్ని ప్రారంభించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు దుదిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజహరుదీన్ తో పాటు ప్రభుత్వ సలహాదారులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాలొన్నారు. మండలిలో సీఎం కార్యాలయంలో రేవంత్ రెడ్డి పూజ చేశారు.*

-ముద్ర, తెలంగాణ బ్యూరో :

### ఇదీ ఏఐ ముద్ర



ఇండియా కప్ కొట్టేసింది.. వరుసగా రెండోసారి.. మొత్తంగా 3వ టైటిల్ టీ20 వరల్డ్ కప్ ఫైనల్ లో న్యూజిలాండ్ ను చిత్తు చేసి విశ్వవిజేత భారత్

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 09.03.2026
www.mudranews.in | @mudranews



**2007 – విజేత: భారత్ | రన్నరప్: పాకిస్థాన్**




దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి టీ20 వరల్డ్ కప్‌లో భారత్ యువజట్టుతో అద్భుతంగా ఆడి టైటిల్ గెలిచింది. ఫైనల్లో పాకిస్థాన్‌పై థ్రిల్లింగ్ విజయం సాధించింది.

# 'నడిగడ్డ'కు న్యాయం ఎప్పుడు?



(మొదటి పేజీ తరువాయి)

మియాపూర్ ప్రాంతం హైదరాబాద్ నగరంలో ఒకప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన నివాస ప్రాంతంగా పేరుగాంచింది. ఇక్కడ పరిశ్రమల అభివృద్ధితో ఉద్యోగాలు పెరగడం, కార్మికులు, వ్యాపారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో అక్కడికి రావడం వల్ల భూముల ధరలు ఆకాశాన్ని తాకాయి. ఉపాధి కోసం వచ్చిన అనేక మంది కార్మికులు, హరిజన, గిరిజన కుటుంబాలు తమకు అందుబాటులో ఉన్న ప్రదేశాల్లో గుడిసెలు వేసుకుని జీవనం ప్రారంభించారు. కాలక్రమేణా ఆ గుడిసెలు పక్కా ఇళ్లుగా మారాయి. అక్కడ నివసిస్తున్న ప్రజలు భారీ ఓటు బ్యాంకుగా మారడంతో వారి సమస్య రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే వారు వేసుకున్న గుడిసెలను తొలగించబోమని గట్టిగా నిలబడడంతో సమస్య మరింత క్లిష్టంగా మారింది. సీఆర్పీఎఫ్ కూడా తమ భూమి అని వాదిస్తూ కఠిన వైఖరి తీసుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

**14.22 ఎకరాల భూమితోనే సమస్య**

హైదరాబాద్ శేరిలింగంపల్లి మండలం మియాపూర్ (ప్రస్తుతం మాదాపూర్ సర్కిల్ పరిధిలోని మయూరి నగర్ డివిజన్)లోని



సర్వే నెం.28లో ఉన్న భూమి వివాదం దాదాపు 50 ఏళ్లుగా కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో సుమారు 800 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. సుభాష్‌నగర్, ఓంకార్ నగర్ వంటి కాలనీల ప్రజలు కూడా తమ ఇళ్లను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

సర్వే నెం.28లో మొత్తం 291.37 ఎకరాల 'ఎనిమీ ప్రాపర్టీ' ఉంది. పాకిస్థాన్‌కు వెళ్లిపోయిన వారి ఆస్తులు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లే నిబంధనల ప్రకారం ఈ భూమి కేంద్రానికి చెందుతుంది. ఈ భూమిని రక్షించేందుకు సీఆర్పీఎఫ్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గిరిజన కుటుంబాలు ఆక్రమించి నివసిస్తున్న 14.22 ఎకరాల భూమి కారణంగానే ప్రధాన వివాదం నెలకొంది. గిరిజనులు స్థలం ఖాళీ చేయాలని సీఆర్పీఎఫ్ ఒత్తిడి చేస్తుండగా, గిరిజనులు తమ హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తున్నారు.

**స్పందన లేని ప్రభుత్వం**

2016లో జరిగిన ఆందోళనల నేపథ్యంలో అప్పటి జిల్లా కలెక్టర్ రఘునందన్ రావు స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ప్రకారం 291.37 ఎకరాల్లో 105 ఎకరాలు మెట్రోకు కేటాయించబడ్డాయి. మరో 104 ఎకరాలు ఖాళీగా ఉండగా, సుమారు 70 ఎకరాల్లో షెడ్లు, గుడిసెలు, చిన్న కాలనీలు ఉన్నాయి. 14.22 ఎకరాల్లో గిరిజన కుటుంబాలు 'నడిగడ్డ తండా' పేరుతో నివసిస్తున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. కేవలం ఆ 14.22 ఎకరాలను గిరిజనులకు కేటాయిస్తే సమస్యకు పరిష్కారం లభించవచ్చని సూచించినప్పటికీ ఇప్పటివరకు ప్రభు



త్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇదే సమయంలో మిగిలిన భూమిలో పక్కా ఇళ్లు, కమర్షియల్ కట్టడాలు, ఫంక్షన్ హాళ్లు నిర్మాణం జరిగాయి.

**ఓట్ల కోసం అవకాశవాద రాజకీయాలు**

స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్, ఎంపీ చొరవ తీసుకుంటే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉన్నప్పటికీ రాజకీయ కారణాలతో అది ముందుకు సాగడం లేదని స్థానికులు అంటున్నారు. సుమారు 800 కుటుంబాల్లో 2500కి పైగా ఓటర్లు ఉండటం వల్ల ప్రతి ఎన్నికల్లో నడిగడ్డ తండా ఓటు బ్యాంక్ కీలకంగా మారుతోంది.

**వసతులు ఉన్నా పట్టాలు లేవు**

ఎంసీపీఐ నాయకుడు ఓంకార్ స్ఫూర్తితో నడిగడ్డ తండా ఏర్పడింది. గిరిజనుల పోరాటానికి మాజీ ఎంపీ భీంరెడ్డి నర్సింహారెడ్డి మద్దతు ఇచ్చారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. సీసీ రోడ్లు నిర్మించారు. గుడిసెల స్థానంలో పక్కా ఇళ్లు నిర్మించబడ్డాయి. అయినప్పటికీ వాటికి ఇప్పటివరకు అధికారికంగా పట్టాలు ఇవ్వలేదు.

**పరిష్కారం కోసం నిరంతర ప్రయత్నాలు**

గిరిజన కుటుంబాలు రాజకీయ నాయకులను, వివిధ కమిషన్లను సంప్రదిస్తూ తమ సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నారు. బీసీ కమిషన్ సభ్యులు, జాతీయ షెడ్యూల్ కమిషన్ ప్రతినిధులు కూడా ఈ ప్రాంతాన్ని సందర్శించి నివేదికలు ఇచ్చినా ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం వెలువడలేదు.

**ఎమ్మెల్యే వైఖరి పై ప్రశ్నలు**

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ గత 12 సంవత్సరాలుగా ఆ పదవిలో ఉన్నారు. ఆయన చిత్తశుద్ధితో ముందుకు వస్తే ఈ సమస్య పరిష్కారమయ్యేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం 291 ఎకరాల్లో కేవలం 25 ఎకరాల భూమి మాత్రమే మిగిలి ఉండగా, గిరిజనుల ఆధీనంలో ఉన్న 14.22 ఎకరాల విషయంలోనే వివాదం కొనసాగడం విచిత్రంగా ఉందని ప్రజాసంఘాలు అంటున్నాయి.

**మరో వెలుగుమట్లగా మారుతుందా?**

గత 50 ఏళ్లుగా సాగుతున్న నడిగడ్డ తండా గిరిజనుల పోరాటం రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి అయినా ఫలిస్తుందా? లేక ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో జరిగినట్లే కఠిన చర్యలు తీసుకుంటారా అనే ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

**నిరంతరం నిఘా**

2016లో ఏర్పాటు చేసిన సీఆర్పీఎఫ్ క్యాంప్ ఇప్పటికీ కొనసాగుతోంది. కాలనీలో అనుమానాస్పద కదలికలు కనిపించినప్పుడు జవాన్లు వెంటనే అక్కడికి చేరుకుని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గిరిజనుల మద్దతుదారులు, సీఆర్పీఎఫ్ జవాన్ల మధ్య తరచూ వాగ్వాదాలు జరుగుతున్నాయి.

### పోరాటం కొనసాగిస్తాం

మియాపూర్ డివిజన్ ఎంసీపీఐ (యు) కార్యదర్శి ఇస్లావత్ దశరథ్ నాయక్ మాట్లాడుతూ, 'నడిగడ్డ తండాలో నివసిస్తున్న గిరిజన కుటుంబాల స్థలాలు రెగ్యులరైజ్ అయ్యే వరకు మా పోరాటం కొనసాగుతుంది. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే వస్తూ సమస్యను వాడుకుంటున్నారు. గిరిజనుల ఇళ్లకు పట్టాలు పొందే వరకు ఉద్యమం ఆగదు" అని తెలిపారు.

**-దశరథ్ నాయక్**







# హైదరాబాద్ లో ప్రతి వారం డ్రై డే

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలన చేయాలని సూచించారు. హైదరాబాద్ జిల్లా 99 రోజుల కార్యాచరణలో ప్రధానంగా దోమల బెడద తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై వెంటనే దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదివారం అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. అందులో అధికారులకు కీలక సూచనలు చేశారు. జీహెచ్ఎంసీ ప్రాంతంలో దోమల సాంద్రతను తగ్గించేలా ఎంటమాలజికల్ సర్వైలెన్స్‌ను బలోపేతం చేయాలని ఆదేశించారు. అధిక దోమల ప్రభావిత ప్రాంతాల్లో వందశాతం జ్వరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల్లో రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత మూడేళ్ల డేటా ఆధారంగా అధిక దోమల ప్రభావిత ప్రాంతాల్లో వచ్చిన వ్యాధుల ఆధారంగా వార్డులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గుర్తించి అక్కడ ప్రాథమిక లార్వా సర్వేలు నిర్వహించి దోమల సాంద్రతను నియంత్రణ స్థాయిలో ఉంచాలని పేర్కొన్నారు. గత 12 నెలల డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా కేసుల లైన్ లిస్టింగ్ చేసి ప్రధాన ప్రాంతాలైన పాఠశాలలు, నిర్మాణ స్థలాలు, నీటి నిల్వ ప్రాంతాలు, స్లమ్ ప్రాంతాలను గుర్తించి వార్డ్ వారీగా మైక్రో ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ఫీల్డ్ సిబ్బందికి ఫాగింగ్, ఐఆర్ఎస్ షెడ్యూల్ నిర్వహించాలన్నారు. అధిక ప్రమాద ప్రాంతాల్లో ఫీవర్ క్యాంపులు నిర్వహణ చేయాలని ఆదేశించిన మంత్రి... రెండు రోజులకు మించి జ్వరం ఉంటే తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఐడీఎస్పీ ద్వారా ప్రతిరోజూ తనకు నివేదికలు అందించాలన్నారు. లార్వా సర్వేలు మళ్లీ నిర్వహించి ప్రాథమిక సర్వేతో పోల్చి మలేరియా ప్రాంతాల్లో ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రే చేయాలన్నారు. వారానికొకసారి ఎంటమాలజీ నివేదికలు అందించాలన్నారు. ప్రజల సహకారంతో నీటి తొట్లు తొలగింపు కార్యక్రమాలు చేపట్టాలని, పెద్ద స్థాయిలో ఫాగింగ్ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల భాగ



స్వామ్యం, పాఠశాలల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లు – కాంట్రాక్టర్లు, వాటర్ వర్క్స్ విభాగం సహకారం తీసుకోవాలన్నారు. ప్రతి ఆదివారం "10 నిమిషాలు దోమల నివారణకు" మీడియా ప్రచారం నిర్వహించాలన్నారు. హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తూ దోమల పెంపక స్థలాలను జియో ట్యాగింగ్ చేయడం, లార్వా సాంద్రత మ్యాపింగ్ ద్వారా పరిస్థితులను నిరంతరం సమీక్ష చేయాలని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలో, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం ద్వారా దోమల నియంత్రణలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# హైదరాబాద్‌లో 10న టీపీటీఎఫ్ నిరసన

**ముద్ర, హైదరాబాద్:**

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, పాఠశాలలు మరియు విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయంలో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి తెలిపారు. ఈ నిరసనకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పండిట్, పీఈటీ పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా ఉన్నతీకరించి వెంటనే పదోన్నతులు ఇవ్వాలని, కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్లను రెగ్యులరైజ్ చేసి టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయడం, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలను 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయడం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. 3 దశల పోరాటంలో భాగంగా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల ముందు నిరసనలు, కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చారు.

## బంగ్లా లో కలకలం

### పూజలో ఉన్న హిందువులపై

# దుండగుల బాంబు దాడి

**ముద్ర, డెస్క్:**

బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరినా మైనార్టీలైన హిందువులపై దాడులు ఆగడం లేదు. తాజాగా మరో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. కోమిల్లా జిల్లాలో పూజ నిర్వహిస్తున్న హిందువుల బృందంపై గుర్తు తెలియని దుండగులు బాంబులతో దాడి చేయడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ ఘటనలో పలువురు గాయపడగా.. ఒక పూజారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

**స్థానిక సమాచారం ప్రకారం..**

కోమిల్లా ప్రాంతంలోని ఒక ఆలయంలో శనివారం సాయంత్రం హిందువులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో అక్కడికి చేరుకున్న కొంతమంది దుండగులు అకస్మాత్తుగా బాంబులు విసిరి అక్కడి నుంచి పరారయ్యారు. బాంబు పేలుళ్లతో ఒక్కసారిగా ఆ ప్రాంతం మొత్తం ఉలిక్కిపడింది. అక్కడ ఉన్న భక్తులు ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీశారు. ఈ ఘటనలో పలువురు గాయపడగా, వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ దాడిలో పూజారి కేశవ్ చక్రవర్తి తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ఇటీవల బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ, సామాజిక ఉద్రిక్తతల నేపథ్యంలో మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని అక్కడి మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యకు గురైన ఘటన తర్వాత దేశవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ సంఘటనకు సంబంధించి వివిధ వర్గాల మధ్య ఉద్రిక్తతలు పెరిగి, కొన్ని ప్రాంతాల్లో మతపరమైన ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయి.

ఈ పరిస్థితుల్లో హిందూ దేవాలయాలు, వారి ఇళ్లు, దుకాణాలు లక్ష్యంగా దాడులు జరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. గత కొద్ది వారాల్లోనే అనేక ప్రాంతాల్లో హిందువులపై దాడులు జరిగినట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో దేవాలయాలను ధ్వంసం చేయడం, ఇళ్లకు నిప్పంటించడం వంటి ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ హింసాత్మక ఘటనల్లో ఇప్పటివరకు పదుల సంఖ్యలో హిందువులు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి.

ఈ పరిణామాల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని మైనారిటీ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తమకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం శాంతి భద్రతల పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నామని, మతపరమైన ఉద్రిక్తతలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది.

అయితే వరుసగా జరుగుతున్న దాడులతో హిందూ సమాజంలో భయం నెలకొంది. పూజలు, ఉత్సవాలు నిర్వహించడానికే భయపడే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# నీటి మీద యుద్ధం!


**బహ్రెయిన్ డీశాలినేషన్ ప్లాంట్‌పై ఇరాన్ డ్రోన్ దాడి**

**ముద్ర డెస్క్ :**

గల్ఫ్ ప్రాంతంలో నీరు అంటే జీవనాడి. సహజసిద్ధమైన నదులు, సరస్సులు లేకపోవడం వల్ల అక్కడి దేశాలు దాదాపుగా సముద్రపు నీటినే ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్నాయి. అందుకే డీశాలినేషన్ ప్లాంట్లు ఆ ప్రాంతానికి కేవలం ఒక సాంకేతిక సదుపాయం మాత్రమే కాదు.. ప్రజల జీవనాధారంగా మారాయి. సముద్రపు ఉప్పునీటిని శుద్ధి చేసి తాగునీటిగా మార్చే ఈ టెక్నాలజీ గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది.

గల్ఫ్ ప్రాంతంలో సహజమైన తాగునీటి వనరులు చాలా తక్కువ. ఎడారి భూభాగం ఎక్కువగా ఉండటం వల్ల భూగర్భజలాలు కూడా పరిమితంగా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో డీశాలినేషన్ టెక్నాలజీ లేకపోతే అక్కడి నగరాలు, పరిశ్రమలు, వ్యవసాయం కొనసాగడం చాలా కష్టమవుతుంది. ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో 400కు పైగా డీశాలినేషన్ ప్లాంట్లు పనిచేస్తున్నాయి. ఇవి కోట్లాది మందికి ప్రతిరోజూ తాగునీటిని అందిస్తున్నాయి.

ప్రత్యేకంగా చూస్తే కువైట్ తన తాగునీటి అవసరాల్లో దాదాపు 90 శాతం, సౌదీ అరేబియా సుమారు 70 శాతం డీశాలినేషన్ ప్లాంట్లపైనే ఆధారపడుతున్నాయి. అంటే అక్కడి ప్రజల జీవితం ఈ ప్లాంట్ల పనితీరుపైనే నిలబడి ఉందని చెప్పాలి. ఎడారి ప్రాంతాల్లో ఉన్నప్పటికీ ఆధునిక నగరాలు, భారీ మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు ఏర్పడటానికి కూడా ఈ టెక్నాలజీ పెద్ద కారణంగా నిలిచింది. అందుకే గల్ఫ్ దేశాలు ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతూ కొత్త ప్లాంట్లు నిర్మించడంపై దృష్టి పెడుతున్నాయి.



ఇలాంటి కీలక మౌలిక వనరులపై దాడులు జరగడం అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఇటీవల బహ్రెయిన్‌లోని ఒక ప్రధాన డీశాలినేషన్ ప్లాంట్‌పై ఇరాన్ డ్రోన్లతో దాడి చేసిన ఘటన దీనికి ఉదాహరణగా నిలిచింది. ఈ దాడి వెనుక కారణంగా ఇరాన్ ఒక వివరణ ఇచ్చింది. తమ దేశంలోని కేశమ్ ఐలాండ్‌లో ఉన్న వాటర్ ప్లాంట్‌పై అమెరికా దాడి చేసిందని అందుకే ప్రతీకారంగా ఈ దాడి చేశామని ఇరాన్ పేర్కొంది. అయితే నిపుణుల అభిప్రాయం ప్రకారం తాగునీటి వనరులను లక్ష్యంగా చేసుకోవడం యుద్ధంలో అత్యంత ప్రమాదకరమైన దిశగా భావించబడుతోంది. ఎందుకంటే విద్యుత్ కేంద్రాలు లేదా సైనిక స్థావరాలపై దాడి చేయడం ఒక విషయం అయితే నీటి వనరులను టార్గెట్ చేయడం నేరుగా ప్రజల జీవనంపై ప్రభావం చూపుతుంది. ఒక డీశాలినేషన్ ప్లాంట్ పనిచేయకుండా పోతే లక్షలాది మంది ప్రజలు తాగునీటి కొరతను ఎదుర్కోవాల్సి వస్తుంది.

ఈ పరిణామం మధ్యప్రాచ్య ప్రాంతంలో జరుగుతున్న ఉద్రిక్తతలు కొత్త మలుపు తీసుకుంటున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా నీరు వంటి ప్రాథమిక వనరులు యుద్ధ వ్యూహాల్లో భాగమవుతుంటే అది మానవతా సంక్షోభానికి దారితీసే ప్రమాదం ఉంది. అందువల్ల భవిష్యత్తులో గల్ఫ్ దేశాలు తమ డీశాలినేషన్ ప్లాంట్ల భద్రతపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మొత్తంగా చూస్తే డీశాలినేషన్ ప్లాంట్లు గల్ఫ్ దేశాలకు కేవలం టెక్నాలజీ ప్రాజెక్టులు కాదు. అవి అక్కడి ప్రజల జీవనరేఖ. అందుకే ఈ వనరులపై జరిగే దాడులు ప్రాంతీయ భద్రతకే కాదు, ప్రపంచానికి కూడా ఒక పెద్ద హెచ్చరికగా మారుతున్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
09.03.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**2009 – విజేత: పాకిస్థాన్ | రన్నరప్: శ్రీలంక**

ఇంగ్లాండ్‌లో జరిగిన ఈ టోర్నీలో పాకిస్థాన్ సమతుల్య ప్రదర్శనతో ట్రోఫీ అందుకుంది. ఫైనల్లో శ్రీలంకను ఓడించి తొలి టైటిల్ గెలిచింది.




# అంతర్జాతీయ నగరంగా భాగ్యనగరం

- ప్రపంచంలోనే మేటి నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దుతాం
- మెట్రోపాలిటన్ సిటీలు ఎదుర్కొంటున్న సమస్యలు తలెత్తకుండా చర్యలు
- ప్రమాదాలకు నివారణకు పకడ్బందీ ప్రణాళికలు
- సుప్రీంకోర్టు, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల మేరకు మూసీ పునరుద్ధరణ
- గాంధీ సరోవర్ ప్రాజెక్టుపై అనవసర రాద్ధాంతం
- ఈ ప్రాజెక్టు సమగ్ర ప్రణాళికపై ఈ నెల 13న పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- డిసెంబర్ నాటికి వందశాతం ఈవీ బస్సులు
- 2 లక్షల ఆటోలను ఈవీలుగా మార్చబోతున్నాం
- సింగల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేదం
- అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**






హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోనే మేటి నగరాలతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రణాళికలు రూపొందించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందుకోసం పలు కీలక అంశాలను పరిగణలోకి తీసుకున్ని ముందుకువెళ్తున్నట్లు వివరించారు. ప్రధానంగా దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ సిటీలు ఎదుర్కొంటున్న ప్రమాదకర పరిస్థితులు సమీప భవిష్యత్తులో హైదరాబాద్‌కు తలెత్తకుండా నివారించేందుకు ప్రత్యే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందులో కీలకమైన కాలుష్య నియంత్రణ కోసం ఈ ఏడాది డిసెంబర్ 9 లోపు హైదరాబాద్‌లో తిరిగే ఆర్టీసీ బస్సులను వంద శాతం ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టబోతున్నట్లు ప్రకటించారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జ్యోతిరావు పూలే భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మహిళా జర్నలిస్టులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్‌ను కాపాడుకోవడానికి, అంతర్జాతీయ నగరంగా రాణించడానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వానికి అందరి సహకారం కావాలని కోరారు. దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలు ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కొంటున్నాయో అందరూ తెలుసుకోవాలన్నారు. వర్షాలొస్తే ముంబయ్ అతలాకుతలమవుతోందని సీఎం తెలిపారు. ఢిల్లీ వాయు కాలుష్యంతో సతమతమవుతోందన్న సీఎం. . బెంగుళూరులో ట్రాఫిక్ సమస్యలు, వరదలొచ్చినప్పుడు చెన్నైలో ఏర్పడే ప్రమాదకర పరిస్థితులను గమనిస్తూనే ఉన్నామని చెప్పారు. భవిష్యత్తులో హైదరాబాద్ నివాసయోగ్యం కాని నగరంగా మారే పరిస్థితులు రావొద్దని సీఎం ఆకాంక్షించారు. ఇలాంటి పరిస్థితులు హైదరాబాద్ నగరానికి తలెత్తకూడదనే ప్రణాళికలు రూపొందించామన్నారు. హైదరాబాద్‌లో వాయు నాణ్యత (ఏక్యూఐ) ఇప్పటికే ఆరెంజ్ కేటగిరీలోకి చేరిందనీ మరింత ప్రమాదకంగా జీవించడానికి వీలులేని పరిస్థితులు తెచ్చుకోవద్దని సీఎం కోరారు.

హైదరాబాద్‌లో పేరుకుపోతోన్న చెత్త.. దోమల స్వైర విహారం.. మూసీ కాలుష్యం అత్యంత అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు. అందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టకుండా అది సాధ్యపడదన్నారు. నదుల్లో కాలుష్య నివారణకు ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, యూపీలో గంగా నది ప్రక్షాళన, గుజరాత్‌లో సబర్మతీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులు చేపట్టినట్టే, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ఎందుకు చేపట్టొద్దని సీఎం చెప్పారు. సుప్రీంకోర్టు, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల మేరకు మూసీ నదికి సంబంధించి బఫర్ జోన్ విషయంలో 2012లో నిబంధనలు రూపొందించినట్లు వివరించారు. నాలా అయితే బఫర్ జోన్ ఎంత ఉండాలి, చెరువులైతే ఎంత ఉండాలి, నదులైతే ఎంత ఉండాలన్నది ఖరారు చేశారు. ఆ మేరకు మూసీ నది వెంట నాలా అయితే 10 మీటర్లు, నదికి 50 మీటర్ల బఫర్ జోన్ ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని సీఎం ఆదేశాలు జారీ చేశారు. కాలుష్య కారక మూసీ నది పునరుజ్జీవ కార్యక్రమంలో నిర్వాసితులకు ప్రభుత్వం సరైన సహాయం అందిస్తుందన్న రేవంత్ రెడ్డి... ప్రాజెక్టును అడ్డుకోవడంకన్నా బాధ్యత కలిగిన వారంతా నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడం, వారికి మరే ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రభుత్వంతో చర్చించవచ్చని చురకలంటించారు.

**గాంధీ సరోవర్ పై పవర్ పాయింట్ ప్రెజంటేషన్**

విపక్ష పార్టీలన్నీ కలిసి గాంధీ సరోవర్ ప్రాజెక్టు వద్ద ఒక అపార్ట్‌మెంట్‌పై అసవపర రాద్ధాంతం సృష్టిస్తున్నారని సీఎం ఆరోపించారు. ఏడెకరాల ప్రాంతంలో ఉన్న అపార్ట్‌మెంట్‌కు అంతే స్థలమిచ్చి, కొత్తగా నిర్మాణానికి అయ్యే ఖర్చును బ్యాంకులో డిపాజిట్ చేస్తామని నిర్వాసితులకు ముందే చెప్పామన్నారు. లేదంటే నష్టపరిహారం తీసుకుని వేరే ప్రాంతంలో కట్టుకుంటామన్నా ఇబ్బంది లేదని ప్రభుత్వం పలు ప్రత్యామ్నాయాలను సూచించిందని సీఎం అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ఫేజ్ - 1లో గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం 5 వేల కోట్లు, 10 వేల కోట్లు వెచ్చిస్తున్నారంటూ చిలువలు పలువలు చేసి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గాంధీ విగ్రహం కోసం దాదాపు 70 కోట్లు, విజ్ఞాన కేంద్రం, ఆ ప్రాంత అభివృద్ధి మొత్తంగా 200 కోట్లు మాత్రమే ఖర్చవుతుందని తెలిపారు. ఈ వాస్తవాలను ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. అందుకే ఈ ప్రాజెక్టు సమగ్ర ప్రణాళికపై ఈ నెల 13న పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నట్లు వివరించారు.

**డిసెంబర్ లోగా ఎలక్ట్రిక్ బస్సులు**

కాలుష్య నివారణలో భాగంగా ఈ ఏడాది డిసెంబర్ 9 నాటికి హైదరాబాద్‌లో ఆర్టీసీ ద్వారా వంద శాతం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెడుతున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రస్తుతం ఆర్టీసీలో 2800 బస్సులు డీజిల్‌తో నడుస్తున్నాయని చెప్పారు.. కాలుష్య నియంత్రణలో భాగంగా వాటి స్థానంలో 500 ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. డీజిల్ వాహనాలను ఓఆర్ఆర్ అవతలి ప్రాంతానికి తరలించి వాటి స్థానంలో డిసెంబర్ నాటికి నూరుశాతం ఈవీ బస్సులను ప్రవేశపెడుతామని సీఎం చెప్పారు. ఈవీ వాహనాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈవీ వాహనాలకు జీరో పన్ను పాలసీ తెచ్చినట్లు వివరించారు. దీంతో పాటు ప్రస్తుతం నగరంలో డీజిల్, పెట్రోల్ ఇతర ఇంధన ఆధారంగా నడుస్తున్న 2 లక్షల ఈ ఆటోలను రెట్రోఫిటింగ్ కింద ఈవీలుగా మార్చాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నామన్న ఆయన నగరంలో కాలుష్య కారక రెడ్, ఆరెంజ్ కేటగిరీలోని పరిశ్రమలను నగరం అవతలి వైపునకు తరలిస్తున్నట్లు వివరించారు.

**మహిళా సహకారం అవసరం**

దేశ జనాభాలో 2.5 శాతం ఉన్న తెలంగాణ జీడీపీలో 5 శాతం మేరకు దోహదపడుతున్న నేపథ్యంలో 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలని లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 2047 నాటికి దేశ జీడీపీలో 10 శాతం తెలంగాణ నుంచి దోహదపడాలన్న ఆయన ఈ లక్ష్యసాధనలో మహిళలు సంపూర్ణంగా సహకరించాలన్నారు. మహిళా జర్నలిస్టులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపునిస్తోందని చెప్పారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేసే చోట మహిళలకు రక్షణ కోసం కమిటీలను ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. డెస్క్ జర్నలిస్టుల గుర్తింపు విషయంలో ఎవరికీ అన్యాయం జరగదు. మహిళలు ఆర్థికంగా ఎదిగిన కారణంగానే కొన్ని దేశాలు ఆర్థికంగా బలమైన దేశాలుగా నిలబడ్డాయని సీఎం చెప్పారు. సమాజంలో మహిళల పట్ల కొనసాగుతున్న వివక్షకు ముగింపు పలకాలంటే మహిళల శక్తిని గుర్తించి సమాన అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళల శ్రమకు తగిన గుర్తింపు లభించడం లేదన్న సీఎం... కష్టపడే వారికి గుర్తింపునివ్వాల్సిన బాధ్యత అందరిపైనా, ప్రభుత్వాలపైనా ఉందని చెప్పారు. దేశంలో అగ్రస్థానంలో తెలంగాణను నిలపాలన్న లక్ష్య సాధనలో మహిళా జర్నలిస్టుల సహకారం ఉండాలని సీఎం ఆకాంక్షించారు.. మహిళలకు ప్రాధాన్యత కలిగిన రాష్ట్రంగా తెలంగాణకు గుర్తింపు తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజహరుద్దీన్, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఐ అండ్ పీఆర్ కమిషనర్ సీహెచ్ ప్రియాంకతో పాటు మహిళా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయంతోనే భవిష్యత్తు

- రైతులకు అండగా కేంద్ర ప్రభుత్వం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. కిసాన్ సమ్మాన్ నిధి, భూసార పరీక్షలు, కిసాన్ క్రెడిట్ కార్డులు రైతు సంక్షేమం కోసం కేంద్రం ఇస్తోందన్నారు. అనేక విషయాల్లో కేంద్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉండే ప్రయత్నం చేస్తుందన్నారు. ఆదివారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో ఫుడ్‌ప్రాసెసింగ్ ల్యాబ్, రైతు వసతి గృహం ప్రారంభించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ ల్యాబ్ లో పరికరాల పనితీరు ల్యాబ్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న వివిధ పంటలను, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్స్ సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రారంభమైన ఆయన ప్రసంగంలో సేంద్రీయ వ్యవసాయ రంగంలో రైతులను తయారు చేయడం ఏకలవ్య ఫౌండేషన్ ముందు చూపుతో వ్యవహరిస్తుందన్నారు. కేవీకేలో రైతులకు వసతిగృహం కట్టడం మంచి ఆలోచన అని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ ల్యాబ్ ను ఏర్పాటు చేయడం అద్భుతమన్నారు. 200 గ్రామాల ప్రజలు, ఏడుగురు సైంటిస్టులు ఇక్కడ పనిచేయడం మామూలు విషయం కాదని వెల్లడించారు. రైతులకు ఏ కష్టమైనా ఏ ఇబ్బందున్న వారి సమస్యల పరిష్కారం కోసం కేవీకే ముందుకు వస్తుందన్నారు. మంచి విద్యార్థులను తయారు చేస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తుందని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలని ఆలోచనతో ముందుచూపుతో వ్యవహరిస్తుందన్నారు. రైతు కూలీల కొరతను తీర్చడానికి డ్రోన్ ల ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటుందన్నారు. దీంతో రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసే మోడీ కల నెరవేరుతుందన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకుంటున్నట్లే మన ఆరోగ్యాన్ని, వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. దళారి వ్యవస్థ పోవాలనే ఉద్దేశ్యంతో రూ.7 వేల కోట్లతో 10 వేల ఎఫ్పిఓలు తయారు చేశారని చెప్పారు. రైతే రాజుగా తయారు కావాలి అనే ఉద్దేశంతో ప్రధాని మోడీ రైతులను ఒకే వేదిక మీదకు తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నారని వెల్లడించారు. బడ్జెట్ లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు అదనంగా 5 శాతం కేటాయించిందని వెల్లడించారు. కేవీకే, ఏకలవ్య ఫౌండేషన్ సంస్థలు రైతులకు అందుబాటులో ఉంటూ కొత్త కొత్త ఆలోచన కల్పిస్తున్నాయని, సైంటిస్టులను తీసుకువచ్చి రైతులను శాస్త్రవేత్తలుగా తయారు చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు వచ్చి వ్యవసాయం చేసే విధంగా మన సంస్థలు ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు.

**ఆర్గానిక్ వైపు పరుగులు: ఎంపీ రఘునందన్ రావు**

కృషి విజ్ఞాన కేంద్రం ఆర్గానిక్ వైపు పరిగెడుతోందని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం పని చేసే సంస్థ కేవీకే అని అన్నారు. రైతులు ఏ రకమైన పంటలు పండిస్తే భవిష్యత్తు బాగుంటుందో కేవీకేల ద్వారా తెలుసుకోవచ్చన్నారు. రసాయనాల అవసరం లేకుండా సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను మళ్లించే ప్రయత్నం చేస్తుందని అన్నారు. ప్రకృతిని విధ్వంసం చేసి జీవవైవిధ్యాన్ని దెబ్బతీసి ఇంకేదో సాధిస్తాం అనుకుంటే పొరపాటే అని అన్నారు. ప్రతి ఒక కుటుంబంలో ఒకరు క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రతి ఒక్క సమావేశంలో ప్లాస్టిక్ నిషేధం చేద్దామని ముక్తకంఠంగా చెబుతున్నామని, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించేందుకు ముందుకు రావాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రోజు మా ఇంట్లోకి ప్లాస్టిక్ రానివ్వమని మహిళలు ప్రమాణం చేయాలన్నారు.

డీఏఆర్ఈ జాట్ సెక్రెటరీ డాక్టర్ మంగీలాల్ మాట్లాడుతూ వికసిత్ భారత్ లో భాగంగా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత నిస్తుందని, ఆ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. వ్యవసాయ రంగంలో మరింత సాంకేతికత గ్రామాలకు అందాలన్నారు. ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ కార్యకరణి సదస్య భాగయ్య మాట్లాడుతూ రాజకీయాలు పక్కన పెట్టి మన గ్రామాలు అభివృద్ధి చేయాలన్నారు. అందరం కలిసికట్టుగా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ ల్యాబ్ కోసం టాటా కంపెనీ సహాయం చేసిందని వెల్లడించారు. రైతులు రెండో పంటగా వరి వేయకూడదని, దైనందిన జీవితంలో పసుపు, కారంతో పాటు ప్రతిది కల్తీ ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపితే మన ఆరోగ్యాలు ఎంతో బాగుపడతాయన్నారు. ఉగాది నుంచి భూమి సుపోషణ అనే కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో దేవాలయం వద్ద చేయాలన్నారు. ఆవు పేడ, మూత్రంతో భూమిని కాపాడాలని తెలిపా రు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కృషి విజ్ఞాన కేంద్రం పనిచేస్తుంది, తెలంగాణ రాష్ట్రంలో 16 కృషి విజ్ఞాన కేంద్రాలు ఉంటే ఒక కృషి విజ్ఞాన కేంద్రం మెదక్ జిల్లాలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఏవో దేవ్ కుమార్, కౌడిపల్లి మండల వ్యవసాయాధికారి స్వప్న, టాటా కెమికల్స్, ముంబై రాజీవ్ రత్న, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ భాస్కరన్, డాక్టర్ ఏఆర్ రెడ్డి, డైరెక్టర్లు డాక్టర్ సి. మల్లారెడ్డి, రమేష్ గోరంట్ల, చిట్టి బాలసుబ్రమణ్యం, వి.ఓంకార్ యాదవ్, కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టులు, ప్రజాప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదనపు ఎస్పీ మహేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# హెచ్‌సీఏలో పైరవీల సంస్కృతికి చరమగీతం పాడాలి

- డబ్బులు ఇస్తేనే సెలెక్షన్ అనే దుస్థితిపై ఆగ్రహం
- ప్రతిభతో క్రీడల్లో రాణించే పరిస్థితి లేకపోవడం బాధాకరం
- రాబోయే దశాబ్ద కాలానికి కేంద్రం "ఖేలో ఇండియా" మిషన్ ఏర్పాటు
- ప్రతిభకు పట్టం కట్టడంతో పాటు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం
- విజేతలకు స్వయంగా బహుమతులు అందించిన బండి సంజయ్

**ముద్ర, కరీంనగర్ :**

రాష్ట్రంలో ప్రతిభతో క్రీడల్లో రాగణించే పరిస్థితి లేకపోవడం బాధాకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిదర్శనమన్నారు. హెచ్ సీఏలో సెలెక్ట్ కావాలంటే పైరవీ లు, డబ్బులు తీసుకొని సెలెక్ట్ చేసే సంస్కృతిని కొందరు తీసుకొచ్చారని, క్రీడాకారుల ప్రతిభను దెబ్బతీసే దుర్మార్గానికి చరమ గీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం రాబోయే దశాబ్ద కాలానికి గాను 'ఖేలో ఇండియా మిషన్' ను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ మిషన్ ద్వారా క్రీడాకారుల్లోని సమగ్ర ప్రతిభాభివృద్ధికి మార్గం చూపడంతోపాటు కోచ్‌లు, సహాయక సిబ్బంది వ్యవస్థాగత అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. స్పోర్ట్స్ సైన్స్ & టెక్నాలజీ సమీకరణతోపాటు క్రీడా సంస్కృతిని పెంపొందించేందుకు రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పోటీలు, లీగ్స్ పేరిట క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడా శిక్షణ, పోటీల కోసం క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు ప్రారంభించిందన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని క్రీడాకారుల కోసం కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 1 నుండి 7 వరకు ''ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్''పేరిట వారం రోజులపాటు ఆటల పోటీలు నిర్వహించారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం లోని అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో వివిధ క్రీడా పోటీల్లో అర్హత సాధించి, విజేతలుగా నిలిచిన టీంలకు , పార్లమెంటు స్థాయిలో జరిగిన పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులకు, జట్లకు ఈరోజు మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్ సమీపంలోని హోటల్ ''త్రిద''లో బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది.

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తో పాటు కరీంనగర్ బిజెపి జిల్లా అధ్యక్షులు గంగా డి కృష్ణారెడ్డి, , నగరపాలక సంస్థ మేయర్ డిప్యూటీ మేయర్ కోలగని శ్రీనివాస్, సునీల్ రావు , పార్లమెంటు కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ లు గుజ్జ శ్రీనివాస్, మాడ వెంకటరెడ్డి, కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవన శైలిలో క్రీడలు ఒక భాగమని, క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకునే కాకుండా, మానసిక సమస్యలను దూరం చేస్తాయన్నారు. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. క్రీడలు క్రమశిక్షణ, బృందస్ఫూర్తి, చెట్టుగా పనిచేసే తత్వం, నాయకత్వ లక్షణాలు, వ్యూహ రచన నైపుణ్యం, విమర్శనాత్మక ఆలోచన అలవాడేలా చేస్తాయన్నారు. ఈ ఆధునిక కాలంలో విద్య ఎంత అవసరమో క్రీడలు అంతే అవసరం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రతి పార్లమెంటు నియోజకవర్గం ఈ క్రీడలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఈ క్రీడా పోటీలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు ముఖ్యంగా యువతకు ఇదొక మంచి వేదిక అయిందన్నారు.

# కేసీఆర్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- చౌడారంలో గాంధీ విగ్రహావిష్కరణ
- సీసీ కెమెరాలు ప్రారంభించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

మహాత్ముని స్ఫూర్తి తో కేసీఆర్ హయాంలో గ్రామాలకు మహర్దశ వచ్చిందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. చిన్నకోడూరు మండలం చౌడారం గ్రామంలో గాంధీ విగ్రహం, సీసీ కెమెరాలను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపించిన అహింసా, సత్యాగ్రహ మార్గంలోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. గాంధీ బాటలోనే కేసీఆర్, యావత్ తెలంగాణ సమాజం స్వరాష్ట్రం కోసం శాంతియుత పోరాటం చేసి తెలంగాణను సాధించుకున్నామన్నారు. గాంధీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం స్ఫూర్తితో పల్లెల అభివృద్ధికి కేసీఆర్ పాటుపడ్డారని గాంధీజీ కలలు నిజం చేశారన్నారు. 60 ఏళ్లలో చేయని అభివృద్ధి కేసీఆర్ చేసి గ్రామాల స్వరూపాలను మార్చారని అన్నారు. పల్లెల్లో తాగునీరు, మిషన్ భగీరథ పల్లె ప్రగతి, గ్రామాల సమగ్ర అభివృద్ధి రైతులకు భరోసా, రైతు బంధు, రైతు బీమా లాంటి ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో చౌడారం గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసుకొని ఆదర్శంగా నిలుపుకున్నామని, ఐక్యత తో ఉండి మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు. గ్రామానికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
09.03.2026 సోమవారం, హైదరాబాద్

## 4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# ప్రయోగశాలలు లేని చదువు..
# ప్రయోజనం లేని పట్టా!

### మార్పు కోరుతున్న భారతీయ విద్యా వ్యవస్థ

భారతదేశంలోని ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల నుండి సామాన్య కళాశాలల వరకు నేడు ఒక రకమైన నిశ్శబ్ద ఆందోళన గూడుకట్టుకుంది. ఏటా లక్షలాది మంది విద్యార్థులు స్నాతకోత్సవాల్లో ఎంతో గర్వంగా పట్టాలను అందుకుంటున్నారు. కన్నవారి కళ్లలో మెరిసే ఆనందం, రేపటిపై పెట్టుకున్న ఆశలు ఆ పట్టా కాగితంపై సంతకాలతో ముడిపడి ఉంటాయి. కానీ దురదృష్టవశాత్తూ, ఆ పట్టా చేతికి అందడమే విద్యా వ్యవస్థకు మరియు ఉపాధి మార్కెట్‌కు మధ్య ఉన్న భారీ అగాధానికి ఆరంభంగా మారుతోంది. దేశం తన భవిష్యత్తు కోసం, యువశక్తి కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ, చదువుకున్న యువత సరైన పని దొరకక, దొరికిన పనిలో ఇమడలేక సతమతమవుతోంది. ఇది కేవలం ఒక ఆర్థిక సమస్య మాత్రమే కాదు, భారతీయ విద్యా వ్యవస్థ పునాదుల్లో ఉన్న లోపాన్ని ఎత్తిచూపే నమ్మక సంక్షోభం. ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద ఉన్నత విద్యా వ్యవస్థల్లో ఒకటిగా మన దేశం నిలుస్తోంది. కళాశాలల సంఖ్య పెరగడం, మారుమూల ప్రాంతాలకు కూడా విద్య చేరువ కావడం అభినందనీయమే అయినా, ఈ పరిమాణాత్మక పెరుగుదల నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఫలితాలను ఇవ్వడంలో విఫలమవుతోంది. ఇటీవల వెలువడిన గణాంకాలు మనల్ని విస్మయానికి గురిచేస్తున్నాయి. చదువుకుంటున్న యువతలో కేవలం ఒక శాతం కంటే తక్కువ మంది మాత్రమే ఏదైనా రకమైన వృత్తిపరమైన సంస్థాగత శిక్షణ పొందుతున్నారు. అంటే, మన పాఠశాలలు, కళాశాలలు కేవలం సిద్ధాంతపరమైన జ్ఞానాన్ని నూరిపోస్తున్నాయి తప్ప, సమాజంలో ఒక పనిని బాధ్యతాయుతంగా నిర్వహించడానికి కావాల్సిన నైపుణ్యాలను నేర్పించడం లేదు. పట్టభద్రులలో సగం కంటే ఎక్కువ మంది పరిశ్రమల ప్రమాణాలకు ఏమాత్రం సరిపోవడం లేదన్నది కాదనలేని సత్యం. డిగ్రీలు ఉన్నా, ఆధునిక పని వాతావరణానికి యువత సిద్ధంగా లేకపోవడం మన విద్యా విధానంలోని డొల్లతను చాటుతోంది.మన విశ్వవిద్యాలయాలు నేడు ఒక రకమైన ఏకాంత ద్వీపాల్లా మారిపోయాయి. అవి కేవలం బోధన, పరీక్షల నిర్వహణ, ధృవీకరణ పత్రాల జారీకే పరిమితమవుతున్నాయి. మరోవైపు, ప్రపంచం పారిశ్రామికంగా, సాంకేతికంగా వేగంగా దూసుకుపోతోంది. ఈ రెండింటి మధ్య ఎటువంటి సమన్వయం లేకపోవడమే ప్రస్తుత సంక్షోభానికి మూలకారణం. జాతీయ విద్యా విధానం ఈ సమస్యను గుర్తించి, బట్టీ పట్టే పద్ధతుల నుండి బయటకు రావాలని పిలుపునిచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో మార్పు నత్తనడకన సాగుతోంది. అనేక విద్యా సంస్థలు పాత మూస పద్ధతుల్లోనే కొనసాగుతూ, మార్పును ఆహ్వానించడానికి వెనకాడుతున్నాయి. విద్యార్థులకు క్షేత్రస్థాయి అనుభవం కల్పించే శిక్షణలు లేదా అప్రెంటిస్‌షిప్‌లు వంటివి కేవలం కాగితాల మీద సంతకాలకే పరిమితమవుతున్నాయి. ప్రయోగశాలలు కేవలం ప్రదర్శన వస్తువులుగా మారిపోయి, విద్యార్థి చేతులు మట్టి కాకుండానే ఇంజనీరింగ్ పట్టాలు అందుకోవడం విచారకరం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన రాష్ట్రాలను పరిశీలిస్తే ఒక విచిత్రమైన పరిస్థితి కనిపిస్తుంది. అక్కడ వందలాది అంతర్జాతీయ సంస్థలు ఉన్నప్పటికీ, ఆయా కంపెనీలకు కావాల్సిన సాంకేతిక నిపుణుల కొరత తీవ్రంగా ఉంది. వేల సంఖ్యలో పట్టభద్రులు నిరుద్యోగులుగా తిరుగుతుంటే, కంపెనీలు మాత్రం సరైన వ్యక్తులు దొరకడం లేదని వాపోతున్నాయి. పట్టభద్రులు ఉన్నా, వారిని మళ్ళీ ఆ కంపెనీలే భారీ ఖర్చుతో మొదటి నుండి శిక్షణ ఇచ్చుకోవాల్సి వస్తోంది. ఇది ఒక రకమైన జాతీయ వనరుల వృథా. విద్యార్థి చదువుకునే కాలంలోనే పరిశ్రమల అవసరాలను గుర్తించి, అందుకు అనుగుణంగా పాఠ్యప్రణాళికను రూపొందించడంలో మనం ఘోరంగా విఫలమయ్యాము. కొన్ని విదేశీ సంస్థలు మన దేశంలోని ఉన్నత విద్యా సంస్థలతో కలిసి మార్పు కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ, అవి కేవలం కొన్ని నగరాలకే పరిమితమవుతున్నాయి.నిజానికి, ఉన్నత విద్య అనేది కేవలం ఒక ఉద్యోగం సంపాదించడానికి మార్గం మాత్రమే కాదు, అది ఆలోచనా దృక్పథాన్ని మార్చాలి. కానీ ప్రస్తుత విద్యా వ్యవస్థలో ప్రశ్నించే తత్వం కంటే, చెప్పింది రాసే తత్వం పెరిగిపోతోంది. ఆవిష్కరణలు అనేవి కేవలం వార్తల్లోనే కనిపిస్తున్నాయి తప్ప, తరగతి గదుల్లో కాదు. అధ్యాపకులు సైతం కేవలం సిలబస్ పూర్తి చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు తప్ప, విద్యార్థిలోని సృజనాత్మకతను వెలికితీయడానికి సమయం కేటాయించడం లేదు. దీనివల్ల విద్యార్థికి సబ్జెక్టుపై పట్టు రావడం లేదు, ఫలితంగా ఉద్యోగ వేటలో వెనుకబడిపోతున్నాడు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. సరైన వనరులు, నైపుణ్య శిక్షణా కేంద్రాలు లేక వారు కేవలం పట్టాలను అలంకార ప్రాయంగానే చూస్తున్నారు.ఈ అగాధాన్ని పూడ్చడానికి కేవలం చిన్నపాటి మార్పులు సరిపోవు, వ్యవస్థాగతమైన ప్రక్షాళన జరగాలి. విశ్వవిద్యాలయాలకు పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తి కల్పించాలి. అవి నేరుగా పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకుని, మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యాంశాలను మార్చుకునే వెసులుబాటు ఉండాలి. అలాగే, అధ్యాపకుల పనితీరును కేవలం తరగతులు చెప్పడం ద్వారా కాకుండా, వారు ఎన్ని పరిశోధనలు చేశారు, ఎంతమంది విద్యార్థులకు ఉపాధి కల్పించగలిగారు అన్న దానిపై అంచనా వేయాలి. కళాశాలలను కేవలం ప్రభుత్వ నిబంధనల కింద నడిచే కార్యాలయాలుగా కాకుండా, కొత్త ఆలోచనలు పుట్టే కేంద్రాలుగా మార్చాలి. పారిశ్రామిక ప్రాంతాలకు దగ్గరగా విద్యా సంస్థలు ఉండటం వల్ల విద్యార్థులకు నిరంతరం శిక్షణ పొందే అవకాశం లభిస్తుంది. పాఠ్యపుస్తకాల్లోని సిద్ధాంతాలకు, కర్మాగారాల్లోని యంత్రాలకు మధ్య ఉన్న అడ్డుగోడలను కూల్చివేయాలి.ముగింపుగా చెప్పాలంటే, భారతదేశం కేవలం ఒక వినియోగదారు దేశంగా మిగిలిపోకూడదు. మనం సాంకేతికతను సృష్టించే స్థాయికి ఎదగాలి. ఇది జరగాలంటే మన విద్యా సంస్థలు ఆవిష్కరణల నిలయాలుగా మారాలి. డిగ్రీ పట్టా అనేది కేవలం ఉద్యోగ వేటలో చూపించే ఒక కాగితం ముక్కలా కాకుండా, ఆ వ్యక్తికి ఉన్న నైపుణ్యానికి ఒక తిరుగులేని ధృవీకరణగా ఉండాలి. విద్య మరియు ఉపాధి మధ్య ఉన్న ఈ గోడలను కూల్చివేయడం ఇప్పుడు మన ముందున్న అతిపెద్ద సవాలు. ఈ మార్పు రాకపోతే, మన దేశ యువత శ్రమశక్తి వృథా కావడమే కాకుండా, దేశ భవిష్యత్తు కూడా అంధకారంలో పడే ప్రమాదం ఉంది. సంస్కరణలు కేవలం చట్టాల రూపంలో ఉంటే సరిపోదు, అవి ప్రతి విద్యార్థి జీవితంలో వెలుగు నింపేలా అమలు కావాలి. చదువుల బట్టీ విధానం పోయి, బతుకులకు భరోసా ఇచ్చే అసలైన అభ్యాస ప్రక్రియ మొదలవ్వాలి







వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ
9848559863





# గ్లాకోమా: కంటి చూపును దొంగిలించే నిశ్శబ్ద శత్రువు!

* దృష్టి నాడి దెబ్బతినడంతో వచ్చే అంధత్వ వ్యాధి గ్లాకోమా
* (08 - 15 మార్చి "ప్రపంచ గ్లాకోమా వారం" సందర్భంగా)

దృష్టిని దోచుకునే అదృశ్య శత్రువుగా గ్లాకోమా వ్యాధి మిలియన్ల ప్రజల చూపును మింగేస్తున్నది. "కంటి చూపును దోచుకునే రహస్య దొంగ"గా పేరు గాంచిన గ్లాకోమా వ్యాధి చికిత్స కన్న నివారణే మిన్న అని నిర్ధారణ అయ్యింది. కంటి చూపుకు ప్రధానమైన "దృష్టి నాడీ లేదా ఆప్టిక్ నర్వ్" దెబ్బతినడంతో బయట పడే అంధత్వాన్ని గ్లాకోమా వ్యాధి అని పిలుస్తాం. కంటి చూపును నియంత్రించడం, నేత్ర ఆకారం నిలవడానికి అవసరమైన నిర్దిష్ట పీడనాన్ని కల్పించడంలో దృష్టి నాడి ఉపయోగపడుతున్నది. దృష్టి నాడి బలహీనం అయినపుడు లేదా దెబ్బతిన్నపుడు నేత్ర పీడనం పరిమితులు దాటి దృష్టి నాడిపై దుష్ప్రభావాన్ని కలిగించడం వల్ల చూపు క్రమంగా మందగించడంతో పాటు అలాగే నిర్లక్ష్యం చేస్తే శాశ్వత అంధత్వం కూడా కలుగుతుందని సాధారణం ప్రజలకు అవగాహన కల్పించటానికి ప్రతి ఏట మార్చి మాసపు రెండవ వారంలో, అనగా 08 మార్చి నుండి 15 మార్చి 2026 వరకు విశ్వవ్యాప్తంగా 2010 నుంచి "ప్రపంచ గ్లాకోమా వారోత్సవాలు" నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

**తొలి దశలో గుర్తించడమే ఉత్తమ మార్గం:**

గ్లాకోమా ముదిరితే చూపు క్రమంగా తగ్గుతూ నేత్ర వైద్య నిపుణులు కూడా చికిత్స చేయలేని శాశ్వత అంధత్వం కూడా కలుగుతుందని తెలుసుకోని ప్రతి ఏట నేత్ర వైద్యులను సంప్రదించి గ్లాకోమా వ్యాధి నిర్ధారణకు సహకరించాలి. ఎలాంటి వ్యాధి లక్షణాలు లేని కారణంగా గ్లాకోమా రాకను గుర్తించడం కష్టం అవుతుంది. అన్ని వయస్సుల వారికి వచ్చే అవకాశాలున్న గ్లాకోమా వ్యాధి వృద్ధుల్లో అధికంగా కనబడుతుంది. ప్రపంచ అంధత్వంలో రెండవ అతి పెద్ద సమస్యగా గుర్తించిన గ్లాకోమా వ్యాధికి సరైన చికిత్స వనేటికీ అందుబాటులో లేనందున తొలి దశలో గుర్తించి వైద్యుల సలహాలతో దృష్టిని నిలుపుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా 80 మిలియన్ల గ్లాకోమా రోగులు ఉన్నప్పటికీ ఇంకా నిర్ధారణ కాని ప్రజలు అనేకులు ఉండవచ్చని అంచనా. భారత్‌లో గ్లాకోమా వ్యాధిగ్రస్తులు 12 మిలియన్లకు పైగా ఉండవచ్చని, వీరిలో 1.2 మిలియన్లు చూపును కూడా కోల్పోయారని తెలుస్తున్నది. పౌర సమాజంలో 90 శాతం వరకు గ్లాకోమా వ్యాధిగ్రస్తులను గుర్తించడంలో విఫలం అవుతున్నాం.

**ప్రపంచ గ్లాకోమా వారోత్సవాలు-2026 ఇతివృత్తం:**

2025 ప్రపంచ గ్లాకోమా వారోత్సవాల ఇతివృత్తంగా "గ్లాకోమా రహిత ప్రపంచ నిర్మాణానికి ఐక్యం అవుదాం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. గ్లాకోమానుతొలి దశలో గుర్తించడానికి ప్రతి ఏట నేత్ర వైద్యులతో పరీక్షలు చేయించుకోవడం, ప్రజలకు వ్యాధి పట్ల అవమాన కల్పించడం, తగు చికిత్సను తీసుకుంటూ వ్యాధిని అదుపు చేయడం లేదా నయం చేసుకోవడం, గ్లాకోమా పట్ల పూర్తి స్థాయి పరిశోధనలు జరపడం, సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారాలు నిర్వహించడం, ముదిరితే చికిత్స కష్టం కావడం లాంటి ప్రచారాలు నిర్వహించాలి. ఐరాస డబ్ల్యూహెచ్ఓ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2.3 శాతం వరకు గ్లాకోమా రోగులు ఉన్నారని, దాదాపు 4.5 మిలియన్ల ప్రజలు చూపును సహితం కోల్పోయి ఉంటారని తెలుస్తున్నది. కంటిలో నిరంతరం నియమిత జల ద్రావాలు ఊరుతూ, కొంత జలం బయటకు కూడా వస్తుంది. ఈ జల ద్రవం ఊరడం తగ్గినపుడు నేత్ర వ్యాధులకు దారి పడుతుంది. వయస్సు, జాతి, బిపీ, షుగర్, ఇతర వ్యాధులు, కుటుంబ నేపథ్యం, హ్రస్వ దృష్టి లాంటి అంశాలపై దీర్ఘకాలిక గ్లాకోమా ఆధారపడి ఉంటుంది. ప్రపంచ గ్లాకోమా వారోత్సవాల్లో భాగంగా ఉచిత నేత్ర వైద్య శిబికదరాల నిర్వహణ, గ్లాకోమా రోగులకు చికిత్సలు, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు, ఉపన్యాసాలు లాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఉత్తమం. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకున్నట్లు, చూపు ఉన్నప్పుడే తరుచుగా నేత్ర పరీక్షలు నిర్వహించుకుంటూ, భయానక అంధత్వానికి దూరంగా ఉందాం, అందరి కంటి చూపును పువ్వుల్లో పెట్టి కాపాడుదాం.



డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## కలికాలం – కాంతల కాలం
## (చమత్కార కవిత)



పట్టుకుందామని ప్రయత్నిస్తుంటే
ఏ పడతీ ప్రసన్నమవటంలే!
ముట్టుకుందామని మురిసిపోతుంటే
ఏ మగువా ముందుకురావటంలే!
కట్టుకుందామని కాంక్షిస్తుంటే
ఏ కాంతా కలసిరావటంలే!
మాంగళ్యధారణకు ముహూర్తంపెడతానంటే
ఏ మహిళా మెడవంచటంలే!
లాలిస్తానని లేపుతుంటే
ఏ లలన లొంగటంలే!
భరిస్తానని భరోసా ఇస్తుంటే
ఏ భామా భుజాలెత్తటంలే!
సహజీవనం చేద్దామంటే
ఏ స్త్రీ సహకరించటంలే!
సరసాలకు చెంతకురమ్మంటే
ఏ సుందరి సిద్ధపడటంలే!
పట్టుచీరెలిస్తా పక్కకురమ్మంటే
ఏ పయ్యెద పుచ్చుకోవటంలే!
బంగారునగలిస్తా బాగాతయారవ్వమ్మంటే
ఏ భామా బుట్టలోపడటంలే!
వలలో వేసుకుందామనుకుంటే
ఏ వనితా చిక్కటంలే!
స్వర్గం చూపిస్తానంటే
ఏ సుమతీ నమ్మటంలే!
అబలలతరం అంతమైంది
సబలలతరం సాగుతోంది
అతివలతరం ఆరంభమైంది
రమణులతరం రాజ్యమేలుతోంది!




గుండ్లపల్లి
రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.



**సమాజ నిర్మాణంలో స్ఫూర్తిదాయక పాత్ర పోషిస్తున్న మహిళామణులందరికీ**
**అంతర్జాతీయ మహిళాదినోత్సవ శుభాకాంక్షలు**

## పుస్తకమే నా ప్రియురాలు!

ప్రేమికులరోజు వచ్చిందని పూవులను
వెదజల్లకు యువత
పుటల సువాసనలోనే నిజమైన పరిమళం
దాగి ఉంది.
అమ్మాయి చూపు క్షణిక చంద్రకాంతి,
పుస్తక జ్యోతి నిత్య సూర్యోదయం.
చిరునవ్వు మనసును మాయచేయగలదు,
గ్రంథమాత్రం జీవితం మార్చగలదు.
చేతి వేళ్లు కలిసేది ఒక రోజుకే,
పుటల వేళ్లు పట్టేది జీవితమంతా.
అలలవలె ఉప్పొంగే ప్రేమ క్షణికం,
అక్షరాలవలె నిలిచే ప్రేమ
శాశ్వతం.
రూపం కరిగిపోతుంది
కాలంతో,
జ్ఞానం వెలుగుతుంది
యుగాలతో.
మధురమైన మాటలు మరుపులో కలిసిపోతాయి,
మంచి పాఠాలు మనుగడలో నిలిచిపోతాయి.
యువతా! నీ కలలకి తోడు నిలిచేది ఎవరు?
నీ విజయానికి మార్గం చూపేది ఎవరు?
నీ చెంతనున్న పుస్తకమే నిజమైన ప్రియురాలు,
నీ భవిష్యత్తును మలిచే మంగళసూత్రమది.
పూలకన్నా పుస్తకాలను ప్రేమించు,
ప్రేమకన్నా విద్యను ఆలింగనం చేయు.
అమ్మాయి ప్రేమ హృదయానందం,
పుస్తకం ప్రేమ జీవిత విజయానందం.



జటావత్ రాజు (యువ కవి రచయిత) తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
09.03.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





2010 – విజేత : ఇంగ్లాండ్ | రన్నరప్ : ఆస్ట్రేలియా
వెస్టిండీస్‌లో జరిగిన టోర్నీలో ఇంగ్లాండ్ మొదటిసారి టీ20 వరల్డ్ కప్ గెలిచింది. ఫైనల్లో ఆస్ట్రేలియాను సులభంగా ఓడించింది.




## ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా వ్యాపారం చేయాలి

**ముద్ర, తాండూర్ :**

వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పడిన రద్దీ సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ పరిష్కార మార్గం చూపించారు. ఈ సందర్భంగా ఆమె మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి తో కలిసి ఆదివారం పాత మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ రోడ్లపై వచ్చి విక్రయాలు చేస్తున్న వ్యాపారస్తులతో మాట్లాడారు. రోడ్లపై వచ్చి వ్యాపారాలు చేయడం వల్ల ప్రక్కనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే వాహనదారులకు, అంబులెన్స్ వారికీ ట్రాఫిక్ సమస్య చాలా ఇబ్బందికరంగా మారింది. ఇకనుంచి రోడ్డు పైకి రాకుండా రద్దీ లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆడబిడ్డ వివాహానికి కౌన్సిలర్ ఆర్థిక సాయం

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



కౌన్సిలర్ ఉదారత్వంతో ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం అందించి వార్డు ప్రజల మన్ననలు పొందిన ఘటన వికారాబాద్‌లో చోటుచేసుకుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆడబిడ్డ వివాహానికి రూ.21 వేల ఆర్థిక సాయం అందించి తన పెద్ద మనసును చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే వికారాబాద్ జిల్లా కేంద్రంలోని 30వ వార్డు ఇందిరానగర్ కౌన్సిలర్ విజయలక్ష్మి నాగరాజు తన ఎన్నికల హామీలో భాగంగా వార్డు పరిధిలోని ప్రతి ఆడబిడ్డకు తన వంతు సహకారంగా రూ.21 వేల ఆర్థిక సాయం అందిస్తానన్న మాట నిలబెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఇందిరానగర్ కాలనీకి చెందిన బందయ్య గౌడ్ కుమార్తె స్వాతి వివాహానికి ఆదివారం ఆర్థిక సాయం అందించారు. బందయ్య గౌడ్ కుటుంబ సభ్యులు, కాలనీ ప్రజలు, బంధువులు పాల్గొన్నారు.

## సాధించాలంటే త్యాగాలు చేయాలి

**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి :**




మాట్లాడుతున్న సీబీఐ రిటైర్డ్ జేడీ లక్ష్మీనారాయణ

జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే కష్టపడటమే కాకుండా త్యాగాలు చేయాల్సి ఉంటుందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ సమీపంలోని బోయపల్లి వైటిసి భవనంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 150 మంది పదవ తరగతి విద్యార్థులకు ఐఐటీ కళాశాలలో సీటు పొందడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 42 రోజులుగా కొనసాగుతున్న ఈ శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను అవలంభించుకుని వాటిని సాధించడానికి క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. విజయాన్ని సాధించాలంటే సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, పట్టుదలతో చదవడం, లక్ష్యసాధన పట్ల నిబద్ధత కలిగి ఉండటం చాలా అవసరమన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఐఐటీ ప్రవేశాలకు ప్రత్యేక శిక్షణ అందించడం అభినందనీయమని తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలనే సంకల్పం, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా ఉన్నత విద్యలో అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. లక్ష్మీనారాయణ విద్యార్థులతో మాట్లాడి వారికి ప్రేరణనిచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మహబూబ్‌నగర్ అభివృద్ధి కోసం వారి సూచనలు, సలహాలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, రామకృష్ణ మఠం కోఆర్డినేటర్ రాజా మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ కార్మికులు

## పారిశుధ్య కార్మికులు వైద్యులతో సమానం

- **మహిళా పారిశుధ్య కార్మికులకు కాప్రా ప్రెస్ క్లబ్ ఘన సన్మానం**

**ముద్ర, కుషాయిగూడ:**



తమ ప్రాణాలను, ఆరోగ్యాలను లెక్కచేయకుండా పారిశుధ్య పనులు చేస్తున్న జిహెచ్ఎంసీ పారిశుద్ధ కార్మికులు ప్రజలకు ఆరోగ్యాన్నిచ్చే వైద్యులతో సమానమని కాప్రా ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా నూతన కమిటీ అధ్యక్షుడు లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారి, ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శ్రీనివాస్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో కాప్రా ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సీనియర్ జర్నలిస్టుల క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జిహెచ్ఎంసీ మహిళా పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారి, ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శ్రీనివాస్, కోశాధికారి వట్టిపల్లి సురేష్, ఉపాధ్యక్షులు పలుగుల పవన్, లక్కిడి బాలరెడ్డి, కార్యదర్శి రోజారాణి, కార్యనిర్వహణ కార్యదర్శి గడ్డమీద బాలరాజు గౌడ్, సీనియర్ జర్నలిస్టులు కేసి మోహన్, చంద్రమౌళి, క్యాసాని సత్యనారాయణ, కడియాల రమేష్, సహదేవాచారి, ఉల్లోజు శ్రీనివాస్, గుమ్మడి హరిప్రసాద్, రుద్రగోని నర్సింగ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**ముద్ర, మల్కాజిగిరి :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్కాజిగిరి, నేరేడ్మెట్, ఉప్పల్, నాచారం, కాప్రా ప్రాంతాలలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నియోజకవర్గ మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మహిళలకు చీరలు, బహుమతులు పంపిణీ చేశారు. అలాగే ఆశా వర్కర్లు, మహిళా సమాఖ్య సంఘాల సభ్యులు, ఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, పారిశుధ్య కార్మికులు, సమాజంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న డాక్టర్లు, టీచర్లు తదితరులను ఘనంగా సన్మానించి కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మహిళల గొప్పతనాన్ని కొనియాడుతూ "కార్యేషు దాసి, కరుణేషు మంత్రి, భోజేషు మాత" అంటూ కుటుంబం నుండి సమాజం వరకు ప్రతి రంగంలో మహిళల పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. తన జీవితంలో ఇద్దరు మహిళలు ఎంతో ప్రభావం చూపారని, అందులో ఒకరు తన తల్లి అరుంధతి, మరొకరు తన సతీమణి మమతా రెడ్డి అని తెలిపారు.



మల్కాజిగిరిలో



కాప్రాలో

### కాప్రాలో..

మహిళలకు అవకాశాలు కల్పిస్తే వారు సమాజంలో ఆణిముత్యాల్లా వెలుగొందుతారని పేర్కొంటూ ఝాన్సీ లక్ష్మీబాయి, మదర్ తెరిసా, సావిత్రిబాయి పూలే, ఇందిరా గాంధీ వంటి మహనీయ మహిళలను స్మరించుకుంటూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఉప్పల్ బాగాయత్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ మహిళలు శక్తి స్వరూపులు అని పేర్కొన్నారు. నాటి చరిత్ర నుంచి నేటి డిజిటల్ యుగం వరకు మహిళలు ప్రతి రంగంలో తమ ముద్ర వేస్తూ ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు.

### కూకట్‌పల్లిలో..

మహిళలు అన్ని రంగాల్లో రాణించి, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి సునీతా మహేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డు ఫంక్షన్ హాల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సునీతా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు దేనికీ భయపడాల్సిన అవసరం లేదని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని సూచించారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పథకంలోనూ మహిళలకే అగ్రపీఠం వేస్తోందని స్పష్టం చేశారు. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన మహిళలను శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, సీనియర్ నాయకులు గాలి బాలాజీ, మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ పుష్పారెడ్డి, గొట్టుముక్కల వెంకటేశ్వరరావుతో పాటు పలువురు డివిజన్ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి..**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలతో కలిసి కేక్ కట్ చేసి, నియోజకవర్గ ఆడపడుచులందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ అద్భుతమైన ప్రతిభ కనబరుస్తూ దూసుకుపోతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా నేతలు, కార్యకర్తలు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బాలికలకు హ్యూమన్ ప్యాపిలోమా వైరస్ హెచ్పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 14ఏళ్ళు నిండిన ప్రతి బాలికకు ఈ వ్యాక్సిన్ వేయించడం ఎంతో అవసరమన్నారు. ఇది భవిష్యత్తులో వచ్చే గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ కుమార్తెలకు ఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించేందుకు ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ మేయర్ గుమ్మాల మమత , జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కృష్ణ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ గణేష్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వైద్యులు విద్య, రాజు, స్థానిక వైద్యాధికారులు రాఘవేందర్, రమ్యతోపాటు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### అస్మిత లీగ్' క్రీడలు, .వేడుకలు

**హైదరాబాద్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో 'అస్మిత లీగ్' పేరుతో భారీ క్రీడలు, వేడుకల కార్యక్రమాన్ని నిర్వహించారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన 'మేరా యువ భారత్' హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో, భారత క్రీడా ప్రాధికార సంస్థ, ఖేలో ఇండియా, తెలంగాణ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా క్రీడాకారిణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడలు, సామాజిక భాగస్వామ్యం ద్వారా మహిళా సాధికారతను ఈ వేడుక ఘనంగా ప్రతిబింబించింది. కార్యక్రమంలో భాగంగా 13 ఏళ్ల లోపు, 1318 ఏళ్ల మధ్య, 18 ఏళ్ల పైబడిన వయో వర్గాల వారికి పరుగు పోటీలను నిర్వహించారు. క్రీడాకారిణుల ప్రతిభను, వారిలోని పోటీతత్వాన్ని ప్రోత్సహించేందుకు 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందాలను అథ్లెటిక్స్ ఈవెంట్లుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఇనిస్టిట్యూట్ చైర్‌పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, ప్రసార భారతి (ఆకాశవాణి) అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీమతి సీమా కుమారి, అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి శ్రీమతి సౌందర్య, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ చైర్‌పర్సన్ శ్రీమతి బీ. మాధవీ, జాతీయ రోయింగ్ క్రీడాకారిణిఆసియా క్రీడల ప్రతినిధి కుమారి గీతాంజలి, జిల్లా యువజన, క్రీడా అధికారి శ్రీ నందకిషోర్ గోకుల్ హాజరయ్యారు. విజేతలతోపాటు రెండో స్థానంలో నిలిచిన వారికి ధ్రువీకరణ పత్రాలు, పతకాలను ముఖ్య అతిథులు అందజేశారు. క్రీడా ప్రయాణాన్ని మరింత ఉత్సాహంగా కొనసాగించాలని ఈ సందర్భంగా వారు క్రీడాకారిణులను కోరారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.



కూకట్ పల్లిలో



ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో




సికింద్రాబాద్ లో..

## ఉదండాపూర్ నిర్వాసితులకు రూ. 338 కోట్ల పరిహారం

- **జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి :**



ఉదండాపూర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ కింద పెంచిన మొత్తాలతో కలిపి రూ. 338 కోట్లను చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఈ మొత్తాన్ని రెండు నెలల్లో నిర్వాసితులకు అందజేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారని ఆయన వెల్లడించారు. దీంతో పాటు మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఇచ్చిన తరహాలోనే ఉదండాపూర్ నిర్వాసితులకు ప్లాట్లు రిజిస్టర్ చేసి ఇవ్వాలని కోరామని చెప్పారు. హైదరాబాద్‌లోని జలసౌధలో ఆదివారం పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్‌పై జరిగిన అధికారిక సమీక్షా సమావేశంలో ఈ విషయాలపై చర్చించడం జరిగిందని అనిరుధ్ రెడ్డి వివరించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో భాగంగా ఉదండాపూర్ నిర్వాసితులకు ఇచ్చే పరిహారాన్ని రూ. 18 లక్షలకు పెంచడం, ఈ కారణంగా నిర్వాసితులకు అదనంగా రూ. 146 కోట్ల రూపాయల మొత్తాన్ని చెల్లించడానికి ప్రభుత్వం గతంలోనే అంగీకరించిందన్నారు. పెంచిన పరిహారంతో కలిసి ప్రస్తుతం ఉదండాపూర్ నిర్వాసితులకు ఇంకా రూ. 338 కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఈ మొత్తాన్ని రెండు నెలల్లో నిర్వాసితులకు అందజేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. గతంలో మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు జీఓ నంబర్ ఒకటి ద్వారా వారికి కేటాయించిన ప్లాట్లను రిజిస్టర్ చేసి ఇవ్వడం జరిగిందని, అదే విధంగా ఉదండాపూర్ నిర్వాసితులకు ఇస్తున్న ప్లాట్లను రిజిస్టర్ చేసి ఇవ్వాలని కోరామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ విషయంపై ఇదివరకే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడానని అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉదండాపూర్ నిర్వాసితులకు న్యాయం చేయకపోగా భూములు లేని వారికి దొంగ డాక్యుమెంట్లు సృష్టించి పరిహారాలు ఇచ్చారన్నారు. భూములు లేని వారికి ఇళ్లు ఉన్నాయని రికార్డులు క్రియేట్ చేసి వారికి పరిహారం చెల్లించాలని జాబితాలు తయారు చేశారన్నారు. ప్రస్తుతం తాము రీ సర్వే చేయించి అర్హులను గుర్తించడం జరిగిందన్నారు. అలాగే భూములు లేకుండానే దొంగ డాక్యుమెంట్లు సృష్టించి పరిహారాలు కొట్టేసిన వారి నుంచి రికవరీకి ఆర్ అండ్ ఆర్ చట్టం కింద నోటీసులు జారీ చేయించడం జరిగిందని, ఇళ్లు లేకుండానే జాబితాలో ఉన్న అనర్హుల పేర్లను తొలగించడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉదండాపూర్ నిర్వాసితులలో కొంత మంది కోర్టుకు వెళ్లడం జరిగిందని, వారితో మాట్లాడి వారికి రావాల్సిన పరిహారాన్ని అందరితో పాటు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని అనిరుధ్ రెడ్డి కోరారు. ఉదండాపూర్ ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. నిర్వాసితులకు పరిహారం పెంచడంతో ఉదండాపూర్ వద్ద నిర్మించే రిజర్వాయర్ పనులకు అడ్డంకులు తొలిగినట్లైంది.

## పాముకాటుతో మహిళ మృతి

**ముద్ర, పెబ్బేరు :**



శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో పుష్పలత (32)అనే మీహీళ పాముకాటుతో మృతి చెందింది. ఏఎస్ఐ మన్యపు రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 10 గంటల సమయంలో మూత్ర విసర్జనకు బయటకు వెళ్ళింది. కాసేపటికి ఆమె ఏడ్చుకుంటూ కూర్చోగా, నోటి నుంచి నురగలు రావడంతో భర్త రాజేందర్ వెంటనే వనపర్తి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 11.50 గంటల సమయంలో ఆమె మరణించింది. మృతదేహానికి పోస్టుమార్టం చేయించామని ఏఎస్ఐ మన్యపు రెడ్డి తెలిపారు

## 99 రోజుల కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలి

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**



ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక అమలులో రంగారెడ్డి జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆదివారం కలెక్టర్ నారాయణరెడ్డి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక అమలుపై సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 99 రోజుల పాటు చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నిర్దేశిత కార్యాచరణను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, 'అరైవ్ అలైవ్', సంక్షేమం, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళలు, పర్యావరణం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి చేయాలని సూచించారు ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, డీఆర్ఓ సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

**2012 - విజేత: వెస్టిండీస్**

రన్నరప్: శ్రీలంక



శ్రీలంకలో జరిగిన ఈ టోర్నీలో వెస్టిండీస్ జట్టు శక్తివంతమైన బ్యాటింగ్‌తో ట్రోఫీ దక్కించుకుంది. ఫైనల్లో శ్రీలంకను ఓడించింది.

# ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

**- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం లక్ష్యం**

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**ముద్ర, ఎండపల్లి:** ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో మణిదీప, వినాయక గ్రామ పరస్పర సహాయక పొదుపు పరపతి సహకార సంఘం నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరుల చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. మహిళలకు అండగా ఉండాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యంపై తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు నడిపించుకునే అవకాశం కల్పించామన్నారు. మహిళలు పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఇస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాజారాం పల్లిలో మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి చెందడానికి సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామంలో మటన్ ప్రాసెసింగ్ యూనిట్ తో పాటు మరిన్ని పథకాలను తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి కోసం అవకాశాలు కల్పించాలని సర్పంచ్ సంగ రమేష్ మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ లత, మార్కెట్ కమిటీ చైర్మన్ గోపిక తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రథోత్సవం

**- హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**ముద్ర, ధర్మపురి:** ధర్మపురి లోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే రథోత్సవ కార్యక్రమం ప్రతి యేటా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దయతో పుష్కరాల సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ లో తనకు అవకాశం లభించిందన్నారు. వచ్చే ఏడాది లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం తరుపున పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అవకాశం ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారు



**మహాదేవపూర్, ముద్ర:** అవకాశం ఇస్తే అద్భుతాలు సృష్టించే మహాశక్తి స్త్రీలకు ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి లోని జిల్లా గ్రంథాలయ సంస్థలో చైర్మన్ కోట రాజబాబు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సాధికారతే సమానత్వపూరిత సమాజానికి నిజమైన దారి అన్నారు. అనంతరం గ్రంథాలయ మహిళా సిబ్బందిని, మహిళా పాఠకులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తిరుపతి రెడ్డి, లైబ్రేరియన్ రాణి, సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**మహదేవపూర్, ముద్ర:** స్థానిక సర్పంచ్ హసీనా భాను ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళా సాధికారత కోసం కృషి చేస్తోందన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు రానున్న రోజుల్లో అనేక సదుపాయాలు కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అంతకుముందు ఉపసర్పంచ్ శ్రీజ, సంతోష్, మహిళ వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి, మహిళా వీవోఏలు, గ్రామ పంచాయతీ కార్మిక సిబ్బందిని సన్మానించారు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



**మహాదేవపూర్, ముద్ర:** నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని స్థానిక ఎస్సై పవన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక లారీలపై లెవలింగ్ చేసి డ్రైవర్ల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తే ఊపేక్షించేది లేదన్నారు.

# మహిళల సంక్షేమాన్ని పట్టించుకోని పాలకులు

**- టీయూసీసీ కేంద్ర కమిటీ సభ్యుడు బండారి శేఖర్**



**ముద్ర, కరీంనగర్:** మహిళల సంక్షేమాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని కరీంనగర్ జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, టీయూసీసీ కేంద్ర కమిటీ సభ్యుడు బండారి శేఖర్ ఆరోపించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం బండారి శేఖర్ ఆధ్వర్యంలో మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా టీయూసీసీ కేంద్ర కమిటీ సభ్యుడు బండారి శేఖర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం స్ఫూర్తితో మహిళలు తమ హక్కుల కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం ద్వారా హక్కులు సంక్రమించినా సమాన పనికి సమాన వేతనం అనేది నేటికీ అందని ద్రాక్షగానే మారిందని ఆరోపించారు. పని స్థలాల్లో లైంగిక వేధింపులు, అకృత్యాలు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవం రోజు బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వాలు మహిళల సంక్షేమాన్ని వాగ్దానలకే పరి మితం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఏజెన్సీలను రద్దు చేయాలని డి మాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూని యన్ అధ్యక్షుడు పి. అరుణ్, నాయకులు శారద, పద్మ, అరుణ, సకిన బేగం, రజియా, మమత, సుకన్య, శ్వేతా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ పీవీ వ్యాక్సినేషన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**మహాదేవపూర్, ముద్ర:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పీవీ టీకా ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. 14 నుంచి 15 సంవత్సరాలలోపు బాలికలు తప్పనిసరిగా ఈ టీకా తీసుకోవాలని సూచించారు. బాలికల ఆరోగ్యం కోసం తల్లిదండ్రులు అవగాహన పెంచుకొని టీకా వేయించేందుకు ముందుకు రావాలని కోరారు. జిల్లాలో ఈ వయస్సు గల బాలికలు 2,425 మంది ఉన్నారని చెప్పారు. వీరందరికీ హెచ్‌పీవీ టీకా అందించే కార్యక్రమాన్ని ఆరోగ్య శాఖ చేపట్టిందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రితో పాటు మహాదేవపూర్, చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో టీకా వేస్తారని తెలిపారు. సంక్షేమ శాఖ, విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించి వాక్సిన్ వేయించాలని ఆదేశించారు. ఫిజిషియన్, పిడియాట్రిషన్, అనెస్థీషియా డాక్టర్ల పర్యవేక్షణలో ఆరోగ్యం పరీక్షించి తదుపరి వాక్సిన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి డా. మధుసూదన్, ఉప వైద్యాధికారి డా. శ్రీదేవి, డా. ఉమాదేవి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్య పరిరక్షణకే వాక్సినేషన్

**- ఎమ్మెల్యే రామారావు పటేల్**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసమే ఉచిత టీకాలు వేస్తున్నట్లు ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం నిర్మల్ జిల్లా భైంసా పట్టణం లోని ఏరియా ఆసుపత్రిలో మహిళల ఆరోగ్య రక్షణకు కీలకమైన హ్యూమన్ పాపిలోమా వైరస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సమాజంలో సగమని, వారిని ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడేందుకు ఉచిత టీకాలు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. మహిళల ఆరోగ్యం కాపాడటం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి మహిళలను రక్షించేందుకు ఈ టీకా ఎంతో ఉపయోగకరమని తెలిపారు. చిన్న వయస్సు బాలికలకు ఈ టీకా అందించడం ద్వారా భవిష్యత్తులో క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న ఉచిత ఆరోగ్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆసుపత్రి సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం

**- మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, వారి ఆరోగ్యంతోనే కుటుంబ జీవితం ముడివడి ఉందని నిర్మల్ మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి అన్నారు. ప్రభుత్వం కిషోర బాలికలకు కల్పించిన ఉచిత హెచ్ పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రాణాంతక గర్భాశయ క్యాన్సర్ రాకుండా నిరోధించే వ్యాక్సిన్ ఉచితంగా ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని వివరించారు. ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని ప్రాణాంతక వ్యాధి రాకుండా కాపాడుకోవాలని సూచించారు.

# మహిళా ఉపాధి కోసం పోరాటం చేయాలి




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** మహిళా ఉపాధి కోసం పోరాటం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సంవత్సరం శ్రామిక మహిళల ఉపాధి పై దాడికి వ్యతిరేకంగా పోరాడుదాం అనే నినాదంతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చిందని ఆరోపించారు. ఉపాధిని హక్కుగా కాకుండా సంక్షేమ పథకంగా చేసిందని విమర్శించారు. వీబీజీ రాం జీ పేరుతో నూతన చట్టం తెచ్చిందన్నారు. అందులో రాష్ట్రాలు 40 శాతం వాటా నిధులు కేటాయిస్తేనే ఈ పథకాన్ని అమలు చేయాలనుకోవడం నిరుపేద గ్రామీణ శ్రామిక మహిళల పొట్ట కొట్టడమేనని విమర్శించారు. మహిళలను మాటల్లో అందలమెక్కిస్తూ ప్రకటనలు గుప్పిస్తూనే, సేవారంగంలోని ఉద్యోగాలన్నీ కాంట్రాక్టర్లకు అప్పగిస్తూ పరోక్ష దోపిడీకి తెరతీస్తున్నారనీ దుయ్యబట్టారు. పని గంటలను పెంచి, రాత్రి వేళల్లో పనిచేయాలని ఆంక్షలు పెడుతూ కేంద్ర ప్రభుత్వం వారి హక్కులను కాలరాస్తోందని వాపోయారు. అన్ని రంగాలలో మహిళాభివృద్ధిని ప్రోత్సహిస్తూ రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. మద్యం, మాదకద్రవ్యాలు, అశ్లీల ప్రసారాలను వ్యాపింపచేస్తూ వారి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయన్నాయని తెలిపారు. ప్రతి ఏటా వేల సంఖ్యలో మహిళలు, పిల్లలు అక్రమ రవాణాకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, లలిత, రుక్మిణి, గంగమణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 09-03-2026
www.mudranews.in | @mudranews



**2014 – విజేత: శ్రీలంక | రన్నరప్: భారత్**

బంగ్లాదేశ్‌లో జరిగిన టోర్నీలో శ్రీలంక అను భవంతో అద్భుతంగా ఆడి టైటిల్‌గెలిచింది. ఫైనల్లో భారత్‌ను ఓడించి తమ మొదటి టీ-20 వరల్డ్ కప్ అందుకుంది.





### ఆరోగ్య రక్షణకు

## మహిళలు వ్యాక్సిన్ తీసుకోవాలి

**- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

ముద్ర, భువనగిరి: మహిళలు ఆరోగ్య రక్షణ కోసం హెచ్పీవీ వ్యాక్సిన్ తీసుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం హెచ్పీవీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన మున్సిపల్ చైర్మన్ భువనగిరి తంగెళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసి వారి రక్షణ కొరకు హెచ్పీవీ వ్యాక్సిన్ ఇస్తుందని, గర్భాశయ క్యాన్సర్ రాకుండా కాపాడుతుందని అర్హులైన బాలికలందరూ తీసుకోవాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.మనోహర్ మాట్లాడుతూ ఈ హెచ్పీవీ వ్యాక్సిన్ భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ రాకుండా కాపాడుతుందని ఈ వ్యాక్సిన్ ఖరీదైందని ప్రభుత్వం బాలికలకు ఉచితంగా అందజేస్తుందన్నారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం 14 నుంచి 15 సంవత్సరం లోపల ఉన్న బాలికలు అందరికీ ఉచితంగా వచ్చే నెల 8 వరకు జిల్లా ఆసుపత్రిలో, ఆలేరు, రామన్నపేట, చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇస్తారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ భువనగిరి తంగేళ్లపల్లి శ్రీవాణి మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన బాలికలందరూ వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాయక్ మాట్లాడుతూ వ్యాధి రాకుండా వ్యాక్సిన్ తీసుకోవడం ఉత్తమమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆ వైస్ చిస్తి, మున్సిపల్ కౌన్సిలర్ సుధగాని సరిత, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, డాక్టర్లు ఇంద్రాణి, రామకృష్ణ, యామిని శృతి, డాక్టర్ నిరోషా పాల్గొన్నారు.

## హెచ్పీవి వ్యాక్సిన్ తో గర్భాశయ క్యాన్సర్ కు చెక్




ముద్ర, తుంగతుర్తి: హెచ్పీవి టీకాతో గర్భాశయ కాన్సర్ రాకుండా నివారించవచ్చని తుంగతుర్తి ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మల్ కుమార్ అన్నారు, ఆదివారం హెచ్పీవి టీకాను సర్పంచ్ మల్లెపాక సాయిబాబాతో కలిసి ఏరియా ఆసుపత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ టీకాను 14 సంవత్సరాల ఆడపిల్లలు తప్పనిసరిగా ముందు జాగ్రత్తగా వేసుకోవాలని అన్నారు, దీనివల్ల భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఉంటుందని తెలిపారు. ఆదివారం నుండి ఈ టీకా ఏరియా హాస్పిటల్ తుంగతుర్తిలో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఈ వాక్సిన్ అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్ లో 14 సంవత్సరాల బాలికలకు వేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీ ప్రియ, డాక్టర్ సాయి అశ్విని, డాక్టర్ లింగమూర్తి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ నాగమణి, ఫార్మసిస్ట్ శోభ, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీ పూర్ణగిరి సుదర్శన

## లక్ష్మీ నరసింహా స్వామి కళ్యాణం

**- పాల్గొన్న ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి**

ముద్ర ప్రతినిధి, భువనగిరి: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నమాత్ పల్లి గ్రామంలోని స్వయంభూ శ్రీ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్ల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ చైర్మన్ రావి సురేందర్ రెడ్డి, ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో నిర్వహించగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్బంగా ఆల య ప్రధానార్చకులు జ్యోషి పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ నరసింహస్వామి, అమ్మవార్ల కల్యా ణాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి టౌన్ సీఐ రమేష్, భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, బీబీనగర్ సీఐ ప్రభాకర్ రెడ్డి, ఆలయ ప్రధాన దాత మొసలి ఉదయ్ కుమార్, ఆలయ ధర్మకర్తలు సురపంగ పద్మ నర్సింహా, ఎల్లంల జంగయ్య యాదవ్, బత్తిని సుధాకర్ గౌడ్, పబ్బతి ఉప్పలయ్య, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎల్లంల జంగయ్య యాదవ్, నమాత్ పల్లి గ్రామ సర్పంచ్ అతికం అరుణ లక్ష్మీనారాయణ గౌడ్ తదితరుల పాల్గొన్నారు.



# మహిళల హక్కుల సాధనకు పోరాడుదాం

**- ఐద్వా మండల కార్యదర్శి కొండమడుగు నాగమణి**




ముద్ర ప్రతినిధి, భువనగిరి: అంతర్జాతీయ మహిళా పోరాట దినోత్సవ స్ఫూర్తితో మహిళలపై జరుగుతున్న దాడులకు, హత్యలకు, అత్యాచారాలకు, వివక్షకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడుదామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) భువనగిరి మండల కార్యదర్శి కొండమడుగు నాగమణి పిలుపునిచ్చారు. ఆదివారం భువనగిరి మండల పరిధిలోని నందనం గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో అనేక రంగాలలో పనిచేసిన మహిళలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రంగాలలో పనిచేసిన కొల్లూరి చంద్రమ్మ, కొండాపురం లక్ష్మమ్మ, మోలుగు రాములమ్మ, కొండాపురం కిష్టమ్మ, మోలుగు పద్మ, మోలుగు బాలమని, కొండాపురం కిష్టమ్మలను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో కొండాపురం సత్తమ్మ, అల్లంపల్లి సుగుణ, కొండాపురం భాగ్య, కొల్లూరు రాణి, కొండాపురం సరిత, కొండాపురం రేణుక, మోలుగు నాగరాణి, కొమ్ము అండాలు, కొండాపురం సువర్ణ, కొల్లూరు శ్రావణి, కొల్లూరి దీపిక పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

ముద్ర, తుంగతుర్తి: ఆదివారం మండల కేంద్రంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు పవరపు సంతోష్ పాల్గొని మాట్లాడారు. ఓర్పు, సహనం, ప్రేమ, ఆత్మీయతలు, అనురాగం, సేవాగుణం, ఇవన్నీ అత్యుత్తమ గుణాలు అన్ని మహిళలకు సొంతమని అన్నారు, వివిధ రంగాల్లో సమాజ అభివృద్ధి కోసం వారు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణించిన మహిళలను శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వీట్ పంపిణీ చేశారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ లావణ్య, మహిళా సమైక్య సంఘం అధ్యక్షురాలు జమున, కరాటే మాస్టర్ బొంకూరి అరుణ, ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు గుమ్మడవెల్లి విజయ, ఆరోగ్య సిబ్బంది భారతిలను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లెపాక సాయి బాబా, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు తల్లాడ కేదారి, ప్రధాన కార్యదర్శి పులుసు వెంకన్న, కోశాధికారి గుండ గాని రాము ప్రోగ్రాం, కోఆర్డినేటర్లు పులుసు వెంకట నారాయణ గౌడ్, ఓరుగంటి శ్రీనివాస్, ఓరుగంటి సుభాష్, ఎనగందుల గిరి, తదితరులు పాల్గొన్నారు.



### ఎస్సీల సంక్షేమ పథకాలను అమలు చేయాలి

**- కరపత్రం ఆవిష్కరణ**

ముద్ర, మోత్కూర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా ఎస్సీల సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని మోత్కూర్ మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఆదివారం కరపత్రిక ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగ పిలుపు మేరకు ఎస్సీల సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరపత్రిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరెల్ల రమేష్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి వైరపాక నాగరాజు మాదిగ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంఘ స్వామి, మాదిగ మోత్కూర్ మండల అధ్యక్షుడు బందెల శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



### శ్రీ పచ్చల కట్ట సోమేశ్వరలయంలో

## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన



ముద్ర ప్రతినిధి, భువనగిరి: పట్టణంలోని శ్రీ పచ్చల కట్ట సోమేశ్వరాలయంలో నూతన పునర్ ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొల్లూరి రాజు, ఆలయ ప్రధాన పూజారి కప్పగంతుల నాగరాజు శర్మ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా శృంగేరి పీఠాధిపతి బ్రాహ్మణులచే ప్రతిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాగృతి, జీనియస్ విద్యా సంస్థల యజమాని డాక్టర్ బొజ్జ సూర్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులు ప్రతిష్ట పూజా కార్యక్రమ దాతలుగా 17వ వార్డ్ కౌన్సిలర్ చెన్న మహేష్ స్వాతి సహకారంతో ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భువనగిరిలో అతి పురాతనమైన శ్రీ పచ్చల కట్ట సోమేశ్వర స్వామి ఆలయంలో ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. భువనగిరి పట్టణ ప్రజలు ఈ నియోజకవర్గ ప్రజలు స్వామివారి కృప వల్ల బాగుండాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోట్నక్ ప్రమోద్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబు రావు, భువనగిరి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూర వెంకటేష్, పట్టణ కౌన్సిలర్లు చల్లగురుల రఘుబాబు కృష్ణవేణి, జలగం విగ్నేష్, గుంతల నరసింహ, ఆలయ మాజీ చైర్మన్ దేవరకొండ నరసింహాచారి, ఆలయ కమిటీ డైరెక్టర్లు కాలియా స్వాతి నాగరాజు, వచ్చు నాగరాజు, ఆలయ పూజారులు కప్పగంతుల ప్రవీణ్ శర్మ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### బండరామారం నుండి గానుగుబండ వరకు

## తారు రోడ్డు మంజూరు చేయాలి

**మోకాళ్ల పై నిలబడి బీఆర్ఎస్ శ్రేణుల నిరసన**




ముద్ర, తుంగతుర్తి: తుంగతుర్తి మండలం బండరామారం నుండి గుండెపురి గ్రామం వరకు తారు రోడ్డు వెంటనే మంజూరు చేయాలని ఆదివారం గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద మోకాళ్లపై నిలబడి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో ప్రతిపాదనలు పంపడం జరిగిందని, మారిన రాజకీయ పరిణామాల్లో రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే మందుల సామెల్ తక్షణమే ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు. నియోజవర్గంలో మండలంలో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న అన్ని రోడ్లను ఎండాకాలం లోపు పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆకారపు భాస్కర్, కొల్లూరి మహేందర్, కోతమర్తి సైదులు, కోరుకొప్పుల వెంకన్న, కోరుకొప్పుల ఉప్పలయ్య, భైరోజు సోమనర్స, గడ్డం సూరయ్య, పొదిలి కిష్టయ్య, యమా రవి తదితరులు పాల్గొన్నారు.

### ముత్యాలమ్మ ఆలయానికి బియ్యం అందజేత

ముద్ర, ఖమ్మం: జూలూరుపాడు మండలంలోని ముత్యాలమ్మ తల్లి–పోచమ్మ తల్లి దేవాలయానికి 25 కేజీల బియ్యాన్ని మాదినేని సతీష్ దంపతులు ఆదివారం ఆలయ నిర్వాహకులు కొంతం సత్యనారాయణ – భారతమ్మలకు అందజేశారు. అమ్మవార్ల 14వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం నుండి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పూజల అనంతరం మధ్యాహ్నం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం (నారాయణ సేవ) చేయనున్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన భక్తుడు సతీష్ తన వంతుగా బియ్యాన్ని అందజేసి, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మద్దెబోయిన ప్రసాద్, మద్దెబోయిన కుమార్, సింహాచలం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల రుణమాఫీని అమలు చేయాలి

**- ఎమ్మెల్యే మందుల సామేల్ కు వినతిపత్రం**



ముద్ర, మోత్కూర్: చేనేత కార్మికుల రుణమాఫీని అమలు చేయాలని ఆదివారం చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మందుల సామేల్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు జెల్లా నాందేవ్ మాట్లాడారు. 15 నెలల క్రితం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన సభలోచేనేత కార్మికుల సంక్షేమం కోసం ఒక్కొక్కరికి లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారనీ. ఇప్పటి వరకు ఆ హామీ అమలు కాలేదని అన్నారు. ఆర్థికంగా చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్ పథకం కింద ప్రభుత్వం జమ చేయవలసిన నిధులను వెంటనే విడుదల చేయడం లేదన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకునేలా సహకారం అందించాలని ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు.

ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు జెల్లా నాందేవ్, జిల్లా చేనేత కార్మిక సంగం కార్యదర్శి గుండు వెంకటనర్సు, జెల్లా సత్యనారాయణ, శ్రీను, సోమరాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 09.03.2026
www.mudranews.in | @mudranews



**2016 – విజేత: వెస్టిండీస్**
**రన్నరప్: ఇంగ్లాండ్**



భారత్‌లో జరిగిన టోర్నీలో వెస్టిండీస్ రెండోసారి టీ–20 వరల్డ్ కప్ గెలిచింది. ఫైనల్లో కార్లోస్ బ్రాత్‌వైట్ చివరి ఓవర్‌లో నాలుగు సిక్సర్లు కొట్టి ఇంగ్లాండ్‌ను ఓడించాడు.

# అన్ని రంగాల్లో విజయం.. మహిళల సొంతం

● మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక






**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మహిళలు వంటింటికే పరిమితం కాకుండా సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారని మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవం వేడుకల్లో ఆమె మాట్లాడారు. మహిళా సాధికారత లేకుండా ఏది సాధ్యం కాదన్నారు. ముఖ్యంగా మహిళలు విద్య, ఉపాధి, రాజకీయాలు, క్రీడలు, వివిధ రంగాలలో అత్యంత ప్రతిభ కనబరుస్తున్నారు. మహిళ పారిశుద్ధ సిబ్బందిని అభినందిస్తూ వారు ఉదయాన్నే నిద్ర లేచి పట్టణంలోని అన్ని వీధులను శుభ్రపరుస్తున్నారని, వారు చేసే పని చాలా గొప్పదని అన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మహిళల గురించి స్వయంగా రాసిన ఒక కవిత్వాన్ని చదివి వినిపించారు. అనంతరం మహిళా ప్రజా ప్రతినిధులను సన్మానించారు. వైస్ చైర్మన్ నరేశ్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా కంపోస్ట్ షెడ్డు, పొడి వనరుల సేకరణ కేంద్రంను సందర్శించి సక్రమంగా ప్రాసెస్ చేయుటకు సిబ్బందికి తగు సూచనలను జారీ చేశారు.

**క్రీడా దుస్తులు అందజేత**

మెదక్ పట్టణంలోని అవుట్‌డోర్ స్టేడియంలో లక్ష్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్, కౌన్సిలర్ జుబేర్ అహ్మద్ పాల్గొని జాతీయ స్థాయిలో రాణించిన మహిళా క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు లక్ష్యసాధనలో ముందుండాలని, జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగితేనే విజయం సాధించగలమని తెలిపారు. వైస్ చైర్మన్ దొంతి నరేశ్ మాట్లాడుతూ స్టేడియం అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని క్రీడాకారులకు హామీ ఇచ్చారు. కౌన్సిలర్ జుబేర్ మాట్లాడుతూ మెదక్ పట్టణంలోని ఈ స్టేడియం సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారిందని, పట్టణంలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. అలాగే స్టేడియంలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ అకాడమీలు ఏర్పాటుకు కౌన్సిల్ తరఫున కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కానుగు భూపతి రాజు, పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఆర్. నాగరాజు, పీడీలు మాధవరెడ్డి, దేవేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, లక్ష్య ఫుట్‌బాల్ అకాడమీ కోచ్ వినయ్, ప్రకాష్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి శ్రీనివాస్, ఫుట్ బాల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**ముద్ర, సంగారెడ్డి:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అందోల్ జోగిపేట మున్సిపల్ కార్యాలయంలో ఆదివానం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణారెడ్డి మహిళా కౌన్సిలర్లకు, మున్సిపల్ మహిళా సిబ్బందికి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళా శక్తి చాలా గొప్పదన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మున్సిపల్ పాలకమండలిలో 12 మంది మహిళా కౌన్సిలర్లు గెలవడం విశేషమన్నారు. మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధిస్తారనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి వ్యాక్సిన్

జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య




**ముద్ర, సంగారెడ్డి:**

ప్రపంచ వ్యాప్తంగా మహిళల్లో పెద్ద ఆరోగ్య సమస్యగా ఉన్న సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్ పివి వ్యాక్సిన్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ఆదివారం సంగారెడ్డి జనరల్ ఆసుపత్రిలో హెచ్ పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 15 సంవత్సరాల లోపు బాలికలకు జనరల్ ఆసుపత్రి ,ఏరియా ఆసుపత్రుల్లో హెచ్ పివి వ్యాక్సిన్ ను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల సుమారు 12,500 మంది బాలికలను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించినట్లు వెల్లడించారు. ఈ బాలికలందరికీ ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యక్రమం కాలంలో ఉచితంగా వ్యాక్సినేషన్ నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. బాలికల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రుల సమక్షంలోనే ఈ వ్యాక్సిన్ అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణం కోసం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వసంతరావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జోగిపేటలో..**



జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణారెడ్డి ఆసుపత్రి సూపరిండెంట్ సౌజన్య తో కలిసి హెచ్పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలో చాలా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ తో చాలామంది మహిళలు బాధపడుతున్నట్లు చెప్పారు. నివారణ కోసం 14 సంవత్సరాలు దాటిన బాలికలకు ఈ వాక్సిన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు అరుణ్, కోశికే రాజశేఖర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఓరుగల్లుకు నిధుల కేటాయింపుపై హర్షం

**సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన నేతలు**



**ముద్ర, వరంగల్:**

వరంగల్, హన్మకొండ, ఖాజీపేట నగరాలకు అండర్ గ్రౌండ్ డ్రేయినేజీ నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించడంపై ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మర్యాదపూర్వకంగా కలిసి బొకె అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఓరుగల్లు ప్రజల చిరకాల వాంఛను, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని సీఎం నెరవేర్చడంతో ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక మౌలిక వసతులు అత్యవసరమని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో వరంగల్ అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మైనర్ బాలికపై అత్యాచారం

**ముద్ర, నిజామాబాద్:**

నాగిరెడ్డిపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపారు. బాలికపై అత్యాచారం జరిగినట్లు సమాచారంతో ఘటనాస్థలికి వెళ్లి విచారించిన అనంతరం, బాధితురాలు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలికల విషయంలో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, లైంగికంగా వేధింపులకు గురి చేసినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# బాలికలందరికీ హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయాలి



నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ

**ముద్ర, నిజామాబాద్:**

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధానికి ప్రభుత్వం ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందిస్తుందని, ఈ వ్యాక్సిన్ ను 14 నుంచి 15 ఏళ్ల వయసు ఉన్న బాలికలందరికీ తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి తల్లిదండ్రులకు సూచించారు. ఆదివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆమె హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ఎంతో ఉపయోగకరమైందన్నారు. దీని ద్వారా 95 శాతం గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నిరోధించవచ్చని తెలిపారు. దీనిపై భయాందోళన చెందవద్దని ఆమె సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి రాజశ్రీ పాల్గొన్నారు.

# ముగ్గురు కూతుళ్లను చంపిన కసాయి

● చెరువులో తోసేసి, అదృశ్యమైనట్లు ఫిర్యాదు
● 24 గంటల్లో ఛేదించిన పోలీసులు
● అప్పులు, ఆర్థిక భారమే కారణం
● ఆటో డ్రైవర్‌ఘాతుకం




వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్య రెడ్డి

**ముద్ర, కామారెడ్డి:**

అదృశ్యమైన ముగ్గురు కూతుళ్లను కన్నతండ్రి ఇస్మాయిల్ హత్య చేశాడని ఏఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ మాట్లాడారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ నగర్ కు చెందిన సబీనా ఇస్మాయిల్ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు సిపాత్ (8), అయాత్ (7), మరియం (5) శనివారం ఇంటి నుంచి ఆటో డ్రైవర్ అయిన తన తండ్రి తో కలిసి బయటకు వెళ్లారని తెలిపారు. పిల్లలకు కిరాణా షాపులో తినుబండారాలు కొనిచ్చాడని, ఇంటికి వెళ్లమని చెప్పి ఆటోలో ముగ్గురు పిల్లలను ఎక్కించుకొని కామారెడ్డి పెద్ద చెరువు వద్దకు తీసుకెళ్లాడని వెల్లడించారు. తన ముగ్గురు పిల్లలను చెరువులో తోసేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడని, సాయంత్రం అయినా పిల్లలు రాకపోయేసరికి చిన్నారులు అదృష్టమయ్యారని కామారెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో పట్టణ పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా సీసీ కెమెరాల ఆధారంగా కామారెడ్డి పెద్ద చెరువు వద్ద గాలింపు చర్యలు చేపట్టామని అన్నారు. రాత్రి 11 గంటల వరకు ఆయాత్, మరియం మృతదేహాలు లభ్యమైనాయని, అర్ధరాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టి సిపాత్ మృతదేహాన్ని వెలికి తీశారని తెలిపారు. చిన్నారుల మృతదేహాలను జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆసుపత్రికి తరలించామని చెప్పారు. తండ్రి ఇస్మాయిల్ పరారీలో ఉండగా ఆదివారం పోలీసులు ఇస్మాయిల్ పట్టుకొని విచారించామన్నారు. అప్పుల భారం, ఆర్థిక భారం వల్ల ముగ్గురు కూతుళ్లను పోషించకపోవడం వల్లే ఈ ఘటనకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు. అలాగే ఈనెల 6న కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గోసంకి కాలనీకి చెందిన సింహాద్రి (10), కోదండం విజయ్ (9) శుక్రవారం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ నరహరి, రూరల్ సీఐ రామన్ పాల్గొన్నారు.

# అర్చరీలో జాతీయ స్థాయికి ఎంపికైన జేశ్విన్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



హైదరాబాద్‌లోని ఏకలవ్య స్పోర్ట్స్ హబ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో జేశ్విన్ రెడ్డి ప్రతిభ చాటాడు. అండర్–10 విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.జెశ్విన్ రెడ్డి మెదక్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి కుమారుడు. చిన్న వయస్సులోనే విలువిద్య క్రీడలో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి జాతీయ స్థాయికి ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచారు.ఈ నెల 28 నుంచి విజయవాడలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొననున్నాడు. జాతీయ స్థాయిలో కూడా జెశ్విన్ రెడ్డి మంచి ప్రతిభ కనబరచాలని క్రీడాభిమానులు, పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు.

# మిషన్ భగీరథ నీటిలో పుష్కలంగా ఖనిజ లవణాలు

**ముద్ర, నిజామాబాద్:**



మిషన్ భగీరథ తాగునీటిలో సరిపడా ఖనిజ లవణాలు ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అరుణ్‌కుమార్, డీఈఈ మున్నీ అన్నారు. ఆదివారం రైతునగర్‌లో జల మహోత్సవాన్ని నిర్వహించారు. చేతిపంపులు, మంజీరా నది, మిషన్ భగీరథ, ఆర్వో ప్లాంట్ తాగు నీటిలో ఉండే తేడాలపై ప్రయోగాత్మకంగా పరీక్షలు నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మిషన్ భగీరథ నీటిని పరీక్షించగా, దాంట్లో శరీరానికి కావాల్సిన మినరల్స్ ఉన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనిధి, సర్పంచ్ నాగరాజకుమారి, సూపరింటెండెంట్ భానుప్రకాశ్, ఎంపీవో మహిబూబ్, ఉపసర్పంచ్‌శ్రీను పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
09.03.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**2021 – విజేత: ఆస్ట్రేలియా | రన్నరప్: న్యూజిలాండ్**

యూఏఈలో జరిగిన ఈ టోర్నీలో ఆస్ట్రేలియా తొలిసారి టీ20 వరల్డ్ కప్ ట్రోఫీ గెలిచింది. ఫైనల్లో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించింది.



# మాదిగ కులాన్ని సీఎం విస్మరిస్తున్నారు

- **సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి మోత్కుపల్లి ఆరోపణలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**




మాదిగ కులాన్ని సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు విమర్శించారు. పార్లమెంట్‌లో మాదిగలు అడుగు పెట్ట కూడదన్నట్లుగా వారికి టికెట్లు ఇవ్వలేదని ఆరోపించారు. రాజ్యసభ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అవకాశాల్లో కూడా మాదిగలకు సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదని మండిపడ్డారు. వందల కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా అందులో మాదిగలకు ఒక్కటే ఇచ్చారని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించకుండా కలిసి దావత్‌లు చేసుకుందాం అనడం వల్ల ఎవరికి ప్రయోజనం ఉంటుందని ప్రశ్నించారు. ఆదివారం ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అయ్యాక తాను 200 సార్లు ఫోన్ చేసినా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన తనకు జాతి సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన కుటుంబాలకు ఆర్థిక సాయం కోరేందుకు ప్రయత్నించినా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని తెలిపారు.ఐదు ఎకరాల భూమి ఇస్తే మాదిగ భవనం నిర్మించుకుంటామని చెప్పారు. ఇటీవల మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసిన కృతజ్ఞత కమిటీకి కూడా తనను ఆహ్వానించలేదని అన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని గుర్తుచేసిన ఆయన, రేవంత్ రెడ్డి ఎంతకాలం సీఎంగా ఉన్నా మేము మద్దతిస్తామని చెప్పినా స్పందన లేదన్నారు. వందల సార్లు ఫోన్ చేసినా అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. మాదిగల రాజకీయ హక్కుల కోసం “మాదిగ మహాశక్తి” అనే సంస్థను ప్రారంభించామని మోత్కుపల్లి తెలిపారు. ఇది రాజకీయ పార్టీ కాదని, జాతి ప్రయోజనాల కోసమే పని చేస్తుందని చెప్పారు. మాదిగల ఓట్లను సక్రమంగా వినియోగిస్తే అధికారంలో ఎవరినైనా ఉంచగలమని లేదా దించగలమని పేర్కొన్నారు. అయితే ఎస్సీ వర్గీకరణ నిర్ణయం రేవంత్ రెడ్డి చేసిన మంచి పనిగా పేర్కొన్న మోత్కుపల్లి, ఆ నిర్ణయం వల్లే కాంగ్రెస్‌కు మాదిగలను అనుకూలంగా చేయాలనే ఉద్దేశ్యంతో ఈ సంస్థను ప్రారంభించామని చెప్పారు. తాను రేవంత్ రెడ్డి విషయంలో పాజిటివ్‌గా ఉన్నానని, కానీ పరిస్థితులు తాను నెగిటివ్‌గా మారేలా చేస్తున్నాయని వ్యాఖ్యానించారు.

# పెంబికి జాతీయ స్థాయిలో గుర్తింపు

- **నీతి ఆయోగ్ దక్షిణ భారత ప్రాంతీయ ఉత్తమ సెమినార్‌కు ఎంపిక**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ లో భాగంగా నిర్మల్ జిల్లా పెంబిలో అమలు పరుస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలనిచ్చాయి. పెంబి బ్లాక్‌ను నీతి ఆయోగ్ నిర్వహిస్తున్న ప్రాంతీయ ఉత్తమ పద్ధతుల సెమినార్‌కు ఎంపిక చేశారు. ఈ సెమినార్ సోమవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో జరుగనుంది. ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ కింద అమలవుతున్న ఉత్తమ విధానాలను ఇతర రాష్ట్రాల ప్రతినిధులతో పంచుకునే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సౌత్ జోన్-3కు చెందిన ఆరు రాష్ట్రాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. తెలంగాణ నుంచి కేవలం నిర్మల్, జోగులాంబ గద్వాల్ జిల్లాలు మాత్రమే ఎంపిక కావడం విశేషం. నిర్మల్ జిల్లాలోని పెంబి బ్లాక్ లో విద్య, ఆరోగ్యం, అమ్మ రక్షిత, బాలశక్తి, వ్యవసాయం, ప్రాథమిక వసతుల రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలను ఈ సెమినార్‌లో ప్రదర్శించనుంది. కలెక్టర్ అభిలాష అభినవ్ ఈ కార్యక్రమానికి హాజరై పెంబి బ్లాక్‌లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తారు. పెంబి వంటి గిరిజనులు అధికంగా ఉన్న మండలంలో గతంలో తక్కువ అక్షరాస్యత, పత్తి కోత కాలంలో విద్యార్థుల డ్రాప్‌అవుట్‌లు, ఉపాధ్యాయుల కొరత, తక్కువ పరీక్షా ఫలితాలు వంటి సమస్యలు ఉండేవి. ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ కింద రెండు సంవత్సరాల్లో పలు చర్యలు తీసుకున్నారు. 2024 డిసెంబర్‌లో నీతి ఆయోగ్ నిర్వహించిన ర్యాంకింగ్స్‌లో దేశంలోని 500 బ్లాకుల్లో పెంబి బ్లాక్ నాలుగో స్థానం సాధించి కోటి రూపాయల ప్రోత్సాహక నగదు అందుకుంది. అన్ని శాఖల అధికారులు చేసిన కృషిని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అభినందించారు. విశాఖపట్నంలో నిర్వహించే ప్రాంతీయ ఉత్తమ పద్ధతుల సెమినార్‌లో పెంబి బ్లాక్‌లో చేపట్టిన మంచి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ ఇతర జిల్లాల కలెక్టర్లకు ప్రత్యేక సెషన్‌లో వివరించనున్నారు.

# అనర్హతపై చర్యలు స్పీకర్ నిర్ణయం

- **కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



పార్టీ ఫిరాయింపు కేసు విషయంలో స్పీకర్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పానని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. ఇప్పుడా విచారణ ముగిసి... తీర్పును స్పీకర్ రిజర్వ్ చేసి పెట్టారన్నారు. అనర్హత వేటు స్పీకర్ పరిధిలోని అంశం అన్నారు. విచారణ జరిగిందనీ. స్పీకరే నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఇప్పుడు తాను మాట్లాడేది ఏమీ లేదన్నారు. రిజర్వ్ చేయబడిన తీర్పుపై అనవసర ప్రచారం వద్దన్నారు. కడియం శ్రీహరి ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్లపై విపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. కాగా ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్లకు సంబంధించి స్పీకర్ నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. కడియం శ్రీహరి, దానం నాగేందర్ పిటిషన్లకు సంబంధించి విచారణ పూర్తి చేసిన స్పీకర్ తీర్పును రిజర్వ్ చేశారు. దీంతో ఎలాంటి తీర్పు రాబోతోందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. వీరిద్దరికి స్పీకర్ క్లీన్ చిట్ ఇస్తారా లేక అనర్హత వేటు వేస్తారా అనేది ఆసక్తిగా మారింది. మొత్తం 10 మందిపై అనర్హత పిటిషన్లు దాఖలు కాగా ఇందులో 8 మందికి ఇప్పటికే స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. ఇప్పుడు దానం, కడియం కూడా తాము బీఆర్ఎస్ లోనే ఉన్నామని స్పీకర్ ఎదుట వాదనలు వినిపించారు. దీంతో వీరి విషయంలో ఏం జరగబోతోంది అనేది రాజకీయంగా ఆసక్తిగా మారింది.

# మహిళ సాధికారత దేశ అభివృద్ధికి పునాది

- **ఇందిరమ్మ మహిళా శక్తికి సర్కార్ శ్రీకారం**
- **46 లక్షల మంది మహిళలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు**
- **ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**
- **మంత్రి సీతక్కతో కలిసి డ్వాక్రా మహిళల హెల్త్ ప్రొఫైలింగ్ కార్యక్రమం ప్రారంభం**
- **వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ పోర్టల్ ఆవిష్కరణ**
- **రాష్ట్ర వ్యాప్తంగా హెచ్ పీ వీ వ్యాక్సినేషన్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



మహిళా సాధికారత కేవలం సంక్షేమ నినాదం మాత్రమే కాదని, అది దేశ అభివృద్ధికి పునాది అని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళా శక్తికి గుర్తింపుగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ వంటి పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు రికార్డు స్థాయిలో రుణాలు మంజూరు చేయడంతో పాటు, సుమారు రూ.1,200 కోట్ల వడ్డీ రాయితీని అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో మంత్రి సీతక్కతో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన డయాగ్నస్టిక్, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, ఫీడింగ్ కియోస్క్ స్టాళ్లను మంత్రులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అక్కడున్న మహిళలు, బాలికలతో ముచ్చటించి వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆడిటోరియంలో మహిళల ఆరోగ్య పరీక్షలు, క్యాన్సర్ టీకాలపై రూపొందించిన షార్ట్ వీడియోస్‌ను ప్రదర్శించారు. ఉద్యోగ రీత్యా వేరే ప్రాంతాల్లో ఉండే మహిళల భద్రత, వసతి కోసం ప్రత్యేకంగా రూపొందించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్‌ను, సెర్ప్ గతేడాది సాధించిన విజయాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను మంత్రులు ఆవిష్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా సంఘాల సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, ఆరోగ్యంగా బలంగా ఉండాలనే ఉద్దేశంతో వారి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డ్వాక్రా మహిళల కోసం ఉచిత హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఉన్న 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని దాదాపు 46 లక్షల మంది మహిళలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. సెర్ప్ సహకారంతో మహిళలను సమీప పీహెచ్‌సీలకు తీసుకెళ్లి బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి 30 రకాల కీలక పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య పరీక్షల అనంతరం ప్రతి మహిళకు క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ హెల్త్ రికార్డును సృష్టించి, ఈహెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో భద్రపరుస్తారని మంత్రి వెల్లడించారు. దీంతో భవిష్యత్తులో వారి ఆరోగ్య సమస్యలను సులభంగా గుర్తించి చికిత్స అందించవచ్చని వివరించారు. దేశంలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ తర్వాత అత్యధికంగా వేధిస్తున్న సర్వైకల్ (గర్భాశయ ముఖ ద్వారం) క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని మంత్రి తెలిపారు. తెలంగాణలో ఏటా సుమారు 3,200 సర్వికల్ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయన్నారు. దీని నివారణకు హెచ్‌పీవీ టీకా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. 14 ఏళ్లు నిండిన సుమారు 4 లక్షల మంది బాలికలకు ఈ టీకా వేయనున్నట్లు వివరించారు. బయట మార్కెట్లో రూ.3 వేల నుంచి రూ.4 వేల విలువ చేసే గార్డాసిల్ 4 టీకాను ప్రభుత్వ ఆస్పత్రుల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉచితంగా అందిస్తున్నట్లు ప్రకటించారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సంజయ్ కుమార్, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనితా రామచంద్రన్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, కలెక్టర్ హరి చందన దాసరి, వైద్యాధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మహిళ లేనిదే సృష్టి లేదు

- **తరాలు మారుతోన్న మహిళలపై వివక్ష ఆగలేదు**
- **భర్త, తండ్రి, అన్న మహిళలను తక్కువ చేసి చూస్తున్నారు**
- **మగవాళ్లు ఉంటేనే మహిళలు ముందుకు వెళ్తారనడం దారుణం**
- **సామాజిక తెలంగాణ సాధనలో మహిళల పాత్రే కీలకం**
- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



మహిళా లేనిదే సృష్టి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తరాలు మారుతోన్న మహిళలు ఇప్పటికీ వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఇంట్లో పుట్టినా అదే పరిస్థితి నెలకొందన్నారు. భర్త, తండ్రి, అన్న అంతా మహిళలను తక్కువ చేసేవారే అని అన్నారు. మగవాళ్లు ఉంటేనే మహిళలు ముందుకు వెళ్తారనడం దారుణమన్నారు. సామాజిక తెలంగాణ సాధనలో మహిళల పాత్రే కీలకమని చెప్పారు. మహిళలు లేకుండా ఆ ఉద్యమమే లేదన్నారు. వయసుతో సంబంధం లేకుండా మహిళలు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యాలయంలో ఆమె మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా గివ్ హర్ స్పేస్ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. మహిళా దినోత్సవం రోజే కాదు.. ప్రతి రోజు మహిళలను గౌరవించేలా పరిస్థితులు మారాలని చెప్పారు. ప్రొ.జయశంకర్, మాజీ సీఎం కేసీఆర్ లాంటి వాళ్లు ఈ నేలపై నడిచారంటే అందుకు వాళ్ల తల్లులే కారణమని చెప్పారు. పెద్ద ఇల్లు, చిన్న ఇల్లు, పెద్ద కులం, చిన్న కులం కాదు. మహిళలమంతా ఒక్కటే కులం అని కవిత అన్నారు. ఇల్లు, స్కూల్, హాస్పిటల్ ఏదీ నడవాలన్న మహిళలు ఉండాల్సిందేనని తేల్చి చెప్పారు. ఆధిపత్యం అనేది ఏ రూపంలో ఉన్న సరే మహిళలు సహించవద్దని పిలుపునిచ్చారు. సామాజిక, పురుషాధిక్యతను ఎట్టి పరిస్థితుల్లో సహించే ప్రసక్తే ఉండొద్దని అభిప్రాయపడ్డారు. వంటింటికి మహారాణి మహిళలే అంటారనీ, కానీ వంటింటి పాత్రలపై కూడా పురుషుల పేర్లే ఉంటాయన్నారు.

**‘స్టాండ్ విత్ హర్’తో సీఎం అవమానించారు..**

సీఎం రేవంత్ రెడ్డి ‘స్టాండ్ విత్ హర్’ అనే కార్యక్రమంతో మహిళలను అవమానించారని కవిత విమర్శించారు. మగవాళ్లు ఉంటేనే మహిళలు ముందుకు వెళ్తారనేలా కార్యక్రమం చేయటాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. స్టాండ్ విత్ హర్’ కాదు.‘గివ్ హర్ స్పేస్’ అనేది జాగృతి నినాదం అన్నారు. ఆడవాళ్లు ఎక్సర్ సైజ్, ఎడ్యుకేషన్, ఎంప్లాయి మెంట్ అనే మూడు "ఈ" లను ఫాలో అవ్వాలి అని సూచించారు. మహిళల భద్రత ప్రభుత్వాల బాధ్యత అన్న కవిత.. అది మీరు వేసే భిక్ష కాదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో మహిళలపై క్రైమ్ రేటు 22 శాతం పెరిగిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

# 30 నెలల్లో పాలమూరు- రంగారెడ్డి పూర్తి

- **2027 మార్చి నాటికి కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ పూర్తి**
- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
- **ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టులపై సమీక్ష**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



దక్షిణ తెలంగాణకు వరప్రదాయినీగా ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును వచ్చే 30నెలల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వికారాబాద్, నల్గొండ జిల్లాలలోని కరువు పీడిత, మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తూ 12.30లక్షల ఎకరాలకు సాగునీరందించి తీరుతామన్నారు. వచ్చే ఏడాది మార్చి ఆఖరికి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు,త్రాగు నీరు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. మహబూబ్నగర్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పురోగతిపై ఆదివారం ఆ జిల్లాకు చెందిన సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిర్మాణంలో ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని చెప్పారు. కల్వకుర్తి ప్రాజెక్టుకు రూ. 909 కోట్లు,నెట్టెంపాడుకు రూ. 252 కోట్లు, భీమాకు రూ.200 కోట్లు,కోయిలసాగర్ కు రూ.185 కోట్లు కేటాయించినట్లు వివరించారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ప్రాజెక్టులకు అవసరమైలన భూసేకరణ, పునరావాస పనులకు, భూసేకరణకు ప్రాధాన్యత ఇస్తూ ఈ ఏడాది జూన్ 2 నాటికి రూ.5వేల కోట్లు విడుదల చేయాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు.

**బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులు నిర్లక్ష్యం..**

ఉమ్మడి పాలమూరులోని సాగునీటి ప్రాజెక్టులు గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రి విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో ఆఫ్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడంతో లిఫ్ట్ ఖర్చులు పెరిగి రాష్ట్రానికి నష్టం కలిగిందన్నారు. ఇదే తరహాలో కాళేశ్వరం లిఫ్ట్ ఎత్తిపోతల పథకాన్ని తుమ్మిడి హట్టి నుంచి మేడిగడ్డకు మార్పుతో తెలంగాణ రైతులకు అన్యాయం జరిగిందన్నారు. రైతులకు వాగ్దానం చేసిన సాగునీటి ప్రయోజనాలను అందించడానికి ఈ ప్రాజెక్టులకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని తెలిపారు. అన్ని చర్యలు చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కృష్ణా పరివాహక ప్రాంతంలోని రైతులకు నీటి సరఫరా, అధిక దిగుబడులు, ప్రత్యక్ష ఆర్థిక మద్దతు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**సాగు ప్రాజెక్టులపై అసత్య ప్రచారం..**

సాగు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.35,200 కోట్ల పరిపాలన అనుమతి తీసుకున్నప్పటికీ, సుమారు రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి పనులను నిర్లక్ష్యంగా వదిలేసిందని విమర్శించారు. 2023 సెప్టెంబర్‌లో ఈ ప్రాజెక్టులో ఒక పంపును కేవలం ఒక గంట మాత్రమే నడిపి, ఒక్క ఎకరానికి కూడా సమర్థంగా నీరు అందించలేకపోయారన్నారు. ప్రస్తుతం సవరించిన అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.55,000 కోట్లుగా అంచనా వేస్తున్నట్లు తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ నిర్మాణ వ్యయం కలిపితే మొత్తం వ్యయం రూ.80,000 కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అయినప్పటికీ ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. 2023 డిసెంబర్ 7 నుంచి ఇప్పటివరకు పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌పై రూ.7161 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రాజెక్టు పనులకు రూ.6718 కోట్లు, భూసేకరణకు రూ.284.71 కోట్లు, పునరావాసానికి రూ.63.65 కోట్లు, ఇతర ఖర్చులకు రూ.94 కోట్లు వినియోగించినట్లు వెల్లడించారు.

**జూరాల ప్రాజెక్టు డీసిల్టింగ్..**

జూరాల (ప్రియదర్శిని జూరాల) ప్రాజెక్టులో వెంటనే డీసిల్టింగ్ పనులు ప్రారంభించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టు రూపకల్పన సమయంలో దాని స్థూల నిల్వ సామర్థ్యం 11.94 టీఎంసీలుగా ఉండగా, మట్టిపొరలు పేరుకుపోవడంతో ప్రస్తుతం ప్రభావవంతమైన సామర్థ్యం సుమారు 9 టీఎంసీలకు తగ్గిందని తెలిపారు. 1995లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో గత మూడు దశాబ్దాలుగా సహజంగా పేరుకుపోయిన మట్టి కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రాజెక్టు నుంచి తవ్వి తీసే ఇసుకను గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టు పనులకు ఉపయోగించే అవకాశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు.

**కృష్ణాపై హక్కులు సాధించుకుంటాం..**

తెలంగాణకు కృష్ణా నదిపై ఉన్న హక్కులను సాధించుకోవడం ద్వారా పూర్తిగా వినియోగించుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కృష్ణా పరివాహక ప్రాంతంలో వ్యవసాయరంగంలో రికార్డు స్థాయి పురోగతి సాధించామని తెలిపారు. గత ఖరీఫ్ సీజన్‌లో 148.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి నమోదు కాగా, కనీస మద్దతు ధర కొనుగోలు ద్వారా సుమారు 72 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో సుమారు రూ.20,000 కోట్లు జమ చేసినట్లు వివరించారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖా సలహాదారు ఆదిత్యా దాస్ నాథ్,ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,సహాయ కార్యదర్శి కే.శ్రీనివాస్ తో సహా నీటిపారుదల శాఖా ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
09.03.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



2022 – విజేత: ఇంగ్లాండ్ | రన్నరప్: పాకిస్థాన్

ఆస్ట్రేలియాలో జరిగిన టోర్నీలో ఇంగ్లాండ్ రెండోసారి టీ20 వరల్డ్ కప్ గెలిచింది. ఫైనల్లో పాకిస్థాన్‌ను ఓడించింది.




# హాకీ పండగ..

- గచ్చిబౌలిలో వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ ప్రారంభం
- ఎనిమిది దేశాల జట్లు పోటీపడుతున్న మెగా టోర్నీ
- భారత్-ఉరుగ్వే మ్యాచ్‌పై అభిమానుల దృష్టి

**ముద్ర, శేరిలింగంపల్లి :**
భాగ్యనగరం మరో అంతర్జాతీయ క్రీడా వేదికకు సాక్ష్యంగా నిలిచింది. గచ్చిబౌలి హాకీ స్టేడియంలో 'మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్-2026' పోరు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. అంతర్జాతీయ హాకీ సమాఖ్య, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ మెగా ఈవెంట్‌లో ఎనిమిది దేశాల జట్లు పోటీపడుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో క్రీడాశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**ముఖ్య అతిథిగా సైబరాబాద్ సీపీ**
తొలిరోజు మ్యాచ్‌లకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం.రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి పోటీలు నగరంలో నిర్వహించడం యువ క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. మ్యాచ్‌లకు సంబంధించి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ & ఎండీ డా. ఏ. సోనిబాలా దేవి కూడా పాల్గొన్నారు.

**మైదానంలో హోరాహోరీ..**
మొత్తం ఎనిమిది జట్లు రెండు పూల్‌లుగా విడిపోయి లీగ్ దశలో తలపడుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం 12:45 గంటలకు ఇంగ్లాండ్‌ఇటలీ మధ్య జరిగిన తొలి మ్యాచ్‌తో టోర్నీ ప్రారంభమైంది. అనంతరం కొరియా-ఆస్ట్రియా, స్కాట్లాండ్‌వేల్స్ జట్లు పోటీ పడ్డాయి. రాత్రి 7:30 గంటలకు జరిగే భారత్‌ఉరుగ్వే మ్యాచ్‌పై అభిమానుల దృష్టి కేంద్రీకృతమైంది. స్వదేశీ గడ్డపై భారత మహిళల జట్టు బోణీ కొట్టాలని అభిమానులు ఆశిస్తున్నారు.

**టోర్నీ షెడ్యూల్ ఇలా..**
**పూల్-ఏ :** ఇంగ్లాండ్, కొరియా, ఇటలీ, ఆస్ట్రియా
**పూల్-బీ :** భారత్, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్
లీగ్ మ్యాచ్‌లు : మార్చి 8, 9 మరియు 11 తేదీల్లో జరుగుతాయి.
**నాకౌట్ పోరు :** మార్చి 13న సెమీఫైనల్స్, మార్చి 14న రాత్రి 7:30 గంటలకు ఫైనల్ మ్యాచ్.
**విశ్రాంతి :** మార్చి 10 మరియు 12 తేదీల్లో జట్లకు విశ్రాంతి.

**అతిథులకు తెలంగాణ ఆతిథ్యం**
స్టేడియంలో అత్యాధునిక ఆస్ట్రో టర్ఫ్, హైప్రొఫైల్ భద్రతతో పాటు విదేశీ క్రీడాకారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్రీడాకారులకు తెలంగాణ సంస్కృతిని పరిచయం చేసేలా వారసత్వ కట్టడాల సందర్శన (హెరిటేజ్ టూర్లు) కూడా షెడ్యూల్‌లో చేర్చారు. 2026 మహిళల హాకీ వరల్డ్ కప్‌కు అర్హత సాధించడమే లక్ష్యంగా జరుగుతున్న ఈ టోర్నీలో రాణించిన జట్లు నేరుగా వరల్డ్ కప్‌కు అర్హత సాధించనున్నాయి. హైదరాబాద్ మరోసారి ప్రపంచ క్రీడా పటంలో మెరిసిపోతోంది.

# సాహితీరుషి ముక్తవరం సార్ కు జేజేలు

ముక్తవరం పార్థసారథి సార్ ను తలుచుకున్నప్పుడల్లా నాకు గుర్తుకొచ్చేది ఒక సాహితీ రుషి. పూర్తిగా సాహిత్యానికే తన జీవితాన్ని అంకితం చేసి అదే యజ్ఞంలో మునిగి తేలిన సృజనకారుడాయన. మొదటిసారి ఆంధ్రప్రభ కార్యాలయంలో ఆయన్ను చూసినప్పటి దృశ్యం ఇంకా నాకు గుర్తువుంది. పాతికేళ్ల క్రితం ఓ రోజున పుస్తకాలు నిండిన సూట్ కేసుతో ఆంధ్రప్రభ ఆఫీసుకు వచ్చిన ఆయన నేరుగా వెళ్లి ఎడిటర్ వల్లూరి రాఘవరావును కలిశారు. అప్పుడక్కడ సీనియర్ సబ్ఎడిటర్ గా పని చేస్తున్న నాకు ఆ రోజున ఎడిటర్ వల్లూరి ద్వారా ముక్తవరం పార్థసారథి సార్ పరిచయం అయ్యారు. రిజర్వ్‌బ్యాంకు ఉద్యోగిగా రిటైర్ అయిన తర్వాత చేతికొచ్చిన పీఎఫ్, జీఎఫ్ లాంటి డబ్బుల్లోఅధికభాగం ఖర్చు చేసి ఒకేసారి తొమ్మిది రచనల్ని పుస్తకాలుగా తెచ్చారాయన. వాటిని సమీక్షకు ఇవ్వడానికి వచ్చిన ముక్తవరం సార్ ఆ తర్వాత కాలక్రమంలో ఆంధ్రప్రభ వారపత్రిక మూసేంతవరకూ ఆ పత్రికకు తన రచనల్ని అందిస్తూనే వచ్చారు. శూన్యం నవల కూడా ఆంధ్రప్రభ వీక్లీలో సీరియల్ గా వచ్చి చాలా మంది పాఠకులను ఆకట్టుకుంది. ఆ నవలలో ప్రధానపాత్ర విఠల్ అనుభవాల్లో అధికం ఆయన జీవితంలో జరిగినవే అని చెప్పినట్టు గుర్తు. చాలా మంది సామాన్య, మధ్య తరగతి నిరుద్యోగ యువకుల కలలు, కన్నీళ్లు , ఆశలు ఆకాంక్షలు ఆ ప్రధానపాత్ర విఠల్ ద్వారా ఆవిష్కృతమయ్యాయి. పాత్ర సార్వత్రీకరణకారణంగా శూన్యం నవల మాస్టర్ పీస్ లాగా తయారైంది. చదువుతుంటే కన్నీళ్లు ఆగవు. పోలికలు, సన్నివేశాలు, పాత్రల మనోగతాలు, మానసిక వేదనలు, విషాదాలు మనల్ని వెంటాడుతూనే వుంటాయి.
చిన్న చిన్న వాక్యాలు. సూటిగా సుత్తి లేకుండా చెప్పాలనుకున్నది స్పష్టంగా చెప్పడం ముక్తవరం సార్ ప్రత్యేకత. ఆయనతో పరిచయమైన తర్వాత ఆయన రచనలు, ఆలోచనలు తప్పకుండా ప్రభావితం చేస్తాయి. ఎందుకంటే వాటిలోని నిజాయితీ అలాంటిది అత్యంత సాధారణంగా వుంటూ కేవలం సాహిత్యమే ఆలంబనగా జీవించిన ధన్యజీవి ముక్తవరం సార్. ఎంతో మంది ప్రపంచ ప్రఖ్యాత రచయితల్ని తనదైన శైలిలో తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. ఆ విధంగా చూసినప్పుడు తెలుగు సాహితీ ప్రపంచానికి ఆయన చేసిన సేవ విశిష్టమైనది, ఎంతోవిలువైనది. ఆయన అభిరుచుల ప్రకారం సహకారం అందించి ఆయన సాహితీ ప్రయాణం శక్తివంతంగా సాగడంలో ఆయన సతీమణి వసంత మేడమ్ పాత్ర అభినందనీయం.
ఆంధ్రప్రభ వీక్లీ మూసివేత తర్వాత నేను ఎలక్ట్రానిక్ మీడియాలోకి వచ్చాను. జర్నలిస్టుల విధినిర్వహణా సమయం, బాధ్యతలు, ఒత్తిడి తదితర అంశాలను తీసుకుంటే ప్రింట్ మీడియాకు ఎలక్ట్రానిక్ మీడియాకు చాలా తేడా వుంటుంది. ప్రింట్ మీడియాలో ముఖ్యంగా మ్యాగజైన్లకు పనిచేసేవారికి సమయ సౌలభ్యం ఆశించినస్థాయిలో వుంటుంది. రోజుకు ఆరు, ఆరన్నర గంటలు పనిచేస్తే చాలు. ఎలక్ట్రానిక్ మీడియాలో పని గంటలు 8నుంచి 8.30 గంటలవరకూ వుండడం, వత్తిడి, ఉద్యోగ భద్రత తగ్గిపోవడం తదితర కారణాలతో ముక్తవరం సార్ ను కలవడం తగ్గిపోయింది. ఆయనతోనే కాదు పలువురు సాహితీదిగ్గజాలతో వున్నపరిచయాలనుకూడా బలోపేతం చేసుకోలేకపోయాను. ఉగాదులు లేవు,ఉషస్సులు లేవు అన్నట్టుగా నా పరిస్థితి తయారైంది.. సాహిత్యంమీద అభిరుచిని బలవంతంగా నిగ్రహించుకొని టీవీ జర్నలిస్టుగా బతకాల్సి వచ్చింది. అయినప్పటికీ సార్ ..ఆర్టిస్ట్ అన్వర్ , ఇంకా ఇతర ఉమ్మడి స్నేహితులద్వారా నా యోగక్షేమాలు తెలుసుకుంటూ వుండేవారని తెలిసింది. ఆయనతో పరిచయం కలిగి వుండడం నా అదృష్టం. ఆ అదృష్టాన్ని కలిగిన పలువురు రచయితలు, జర్నలిస్టులు,పాఠకులు, స్నేహితులు ముక్తవరం సార్ ను స్మరించుకొని ఘననివాళి ఘటించారు. ఆ సందర్భంగా ఆయనతోను, ఆయన రచనలతోను వున్న అనుబంధాన్ని చక్కగా స్మరించుకున్నారు.

**- చెమికల రాజశేఖర రెడ్డి,**
**- సీనియర్ జర్నలిస్టు**

## నిరంతర సాహితీ కృషివలుడు పార్థసారథి

**ముద్ర న్యూస్ బ్యూరో**
**హైదరాబాద్ మార్చి 8:**
రెండు రోజుల క్రితం హైదరాబాదులో దివంగతులైన ప్రముఖ సాహితీవేత్త ముక్తవరం పార్థసారథి సంస్కరణ సభ ఆదివారం నాడు మెహిదీపట్నం సమీపంలోని కినారా గ్రాండ్ హోటల్ లో జరిగింది. పలువురు సాహితీవేత్తలు, సంపాదకులు జర్నలిస్టులు, ఆయన మిత్రులు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, సంపాదకులు తెలకపల్లి రవి, వీక్షణం సంపాదకులు ఎన్ వేణుగోపాల్, సీనియర్ జర్నలిస్టులు తాడి ప్రకాష్, ముందలపర్తి కిషోర్, ఖదీర్ బాబు, ప్రముఖ కవయిత్రి కుప్పిలి పద్మ, సీనియర్ జర్నలిస్టులు చెమికల రాజశేఖర్ రెడ్డి, అన్వర్, ఆకుల అమరయ్య, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పార్థసారథి సాహితీ సేవలను, వ్యక్తిత్వాన్ని స్మరించుకున్నారు. ఆయన రచనలు చిరస్థాయిగా నిలిచి చదువరుల మనసులను చూరగొంటాయని వారు అన్నారు. పార్థసారథి సతీమణి ముక్తవరం వసంత, కుమారులు ముక్తవరం వికాస్, సందీప్ మాట్లాడుతూ ఆయన నిరంతర సాహితీ కృషివలుడని,81 ఏళ్ల వయసు దాకా ఏదో ఒక రచన చేస్తూనే వచ్చారని తెలిపారు.
ఈ సంస్మరణ కార్యక్రమంలో నేతాజీ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కె శ్రీధర్ రావు, సురేందర్ రావు, ఎం ఆంజనేయస్వామి, వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## యాదగిరిగుట్ట గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ప్రభుత్వ విప్

- 12 ఏళ్ల వైష్ణోదేవి అద్భుత నృత్య ప్రదర్శన

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**




శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా యాదగిరిగుట్ట చుట్టూ నిర్వహించిన గిరి ప్రదక్షిణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైకుంఠ ద్వారం వద్ద కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరి ప్రదక్షిణ ప్రారంభించి కొండ చుట్టూ వేలాది మంది భక్తులతో కలిసి గిరి ప్రదక్షిణ చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు, ఆలేరు నియోజకవర్గ ప్రజలందరికీ స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న వైష్ణోదేవి నృత్య ప్రదర్శన..**
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌కు చెందిన 12 ఏళ్ల వైష్ణోదేవి కిలోమీటర్ల మేర కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తూ గిరిప్రదక్షిణ చేసింది. స్వాతి నక్షత్రం సందర్భంగా చిన్నారి వైష్ణోదేవి 3 కిలోమీటర్ల గిరిప్రదక్షిణ మార్గమంతా కూచిపూడి నృత్యం చేస్తూ భక్తులను ఆకట్టుకుంది. గిరిప్రదక్షిణలో పాల్గొన్న వేలాది మంది భక్తులు ఆమె నృత్యాన్ని ఆసక్తిగా వీక్షించి ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఆలయ ఈఓ జె.భవానీ శంకర్, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అభినందిస్తూ ఆధ్యాత్మిక ప్రదేశాల్లో భారతీయ సాంప్రదాయ కళలను ప్రోత్సహించడం మంచి ప్రయత్నమని కొనియాడారు. ఈ కూచిపూడి నృత్య ప్రదర్శనను జ్యోతి కళాక్షేత్రం స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైష్ణోదేవి గత ఐదేళ్లుగా తన గురువు జ్యోతి రెడ్డి మార్గదర్శకత్వంలో కూచిపూడి నృత్యాన్ని అభ్యసిస్తోంది. ఈ సందర్భంగా గురువు జ్యోతి రెడ్డి మాట్లాడుతూ.. "గురువుగా ఈ రోజు నాకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉంది" అన్నారు. ఈ సందర్భంగా పి. శ్రీ వైష్ణోదేవి మాట్లాడుతూ గిరిప్రదక్షిణ సమయంలో నృత్యం చేయడం నాకు చాలా ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అనుభూతి అని చెప్పారు. నా తాతమ్మల ఆరోగ్యం కోసం స్వామివారి ఆశీర్వాదాల కోసం ఈ నృత్యాన్ని సమర్పించాను అని తెలిపారు. వేలాది మంది భక్తుల మధ్య నృత్యం చేయడం మరింత ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఆమె తల్లి పి. వినయా దేవి మాట్లాడుతూ.. ఇంత చిన్న వయస్సులోనే వైష్ణోదేవి తన కళను భక్తితో సమర్పించడం చూసి తల్లిదండ్రులుగా మాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆమెకు ఇంత మంచి మార్గదర్శకత్వం ఇచ్చిన జ్యోతి రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రదర్శన నృత్యం మాత్రమే కాదు, భక్తి, కుటుంబ ప్రేమ మరియు విశ్వాసానికి ప్రతీక అని అన్నారు.

# ఆర్థిక అస్త్రం..
# ఇరాన్ సరికొత్త యుద్ధ వ్యూహం

- ఆయుధాల కంటే ఆర్థిక అస్త్రమే మిన్న
- ప్రపంచ దేశాలను ఒత్తిడిలోకి నెట్టే లక్ష్యంగా ఇరాన్ పావులు
- హర్మూజ్ జలసంధిని మూసివేస్తామని హెచ్చరికలు
- చమురు, సబ్‌సీ కేబుళ్లపై దాడులతో అమెరికాను కట్టడి చేసే యోచన



**ముద్ర డెస్క్ :**
ఇప్పటివరకు మనం చూసిన యుద్ధాలు సరిహద్దుల కోసం, క్షిపణుల దాడితో సాగేవి. కానీ, ఇప్పుడు ఇరాన్ అనుసరిస్తున్న వ్యూహం మాత్రం భిన్నమైనది. అమెరికాఇజ్రాయెల్ కూటమిని నేరుగా సైనిక యుద్ధంలో ఓడించడం అసాధ్యమని గుర్తించిన ఇరాన్, ఆయుధ మార్గం నుంచి 'ఆర్థిక యుద్ధం' వైపు మళ్లింది. ప్రపంచ జీవనాడి అయిన ఇంధన సరఫరాను, కమ్యూనికేషన్ వ్యవస్థను అస్తవ్యస్తం చేయడం ద్వారా అంతర్జాతీయ సమాజంపై ఒత్తిడి పెంచి, తద్వారా అమెరికా ఆగ్రహానికి పగ్గాలు వేయాలన్నది ఆ దేశ వ్యూహంగా కనిపిస్తోంది.

**హర్మూజ్ జలసంధిపై నీలినీడలు**
ఇరాన్ ఐఆర్‌జీసీ అధికార సలహాదారు బ్రిగేడియర్ జనరల్ ఇబ్రహీం జబారీ ఇటీవల చేసిన ప్రకటన ప్రపంచ దేశాల్లో కలకలం రేపింది. "హర్మూజ్ జలసంధిని మూసేశాం. బ్యారెల్ చమురు ధర 80 డాలర్లకు చేరింది. త్వరలోనే ఇది 200 డాలర్లకు చేరుతుంది" అని ఆయన హెచ్చరించారు. ప్రపంచ చమురు సరఫరాలో అత్యంత కీలకమైన ఈ మార్గంపై ఇరాన్ పట్టు సాధిస్తే, భారత్, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలతో పాటు యూరప్, చైనాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలే ప్రమాదం ఉంది.

**సబ్‌సీ కేబుళ్లపై కన్ను..**
**కమ్యూనికేషన్ వ్యవస్థలకే ముప్పు**
కేవలం చమురు సరఫరానే కాకుండా, ప్రపంచ డిజిటల్ వ్యవస్థకు వెన్నెముక వంటి 'సబ్‌సీ కేబుల్స్'పై కూడా ఇరాన్ దృష్టి సారించింది. ఇప్పటికే బహ్రెయిన్‌లోని డేటా కేంద్రాలపై దాడులు జరగడం, ఇరాన్ అనుసరిస్తున్న వినాశకర వ్యూహానికి నిదర్శనం. సముద్ర గర్భంలోని కేబుళ్లకు గనుక నష్టం జరిగితే, ప్రపంచవ్యాప్తంగా కమ్యూనికేషన్, బ్యాంకింగ్, మౌలిక వసతులు అస్తవ్యస్తమై, ఆర్థిక వ్యవస్థలు స్తంభించిపోయే ప్రమాదం ఉంది.

**ఆగేదెప్పుడు?**
ఇరాన్ వ్యూహం కేవలం తనను తాను రక్షించుకోవడమే కాదు, అమెరికా విధించే కఠిన షరతులను దౌత్యపరంగా ఎదుర్కోవడానికి ఒక బేరసారాల మార్గాన్ని సిద్ధం చేసుకోవడం. క్షిపణి దాడులు ఆగితే యుద్ధం ఆగిపోవచ్చు, కానీ ఇరాన్ ప్రారంభించిన ఈ 'ఆర్థిక యుద్ధం' తాలూకు గాయాలు ప్రపంచంపై ఎంతకాలం ఉంటాయన్నదే ఇప్పుడు అసలైన ప్రశ్న. దిల్లీ నుంచి బ్రసెల్స్ వరకు, బీజింగ్ నుంచి వాషింగ్టన్ వరకు ఈ యుద్ధ వేడి ప్రతిధ్వనిస్తోంది.

**ఒంటరి పోరాటం కాదు..**
**ప్రపంచాన్ని భాగస్వామ్యం చేయడం!**
వాస్తవానికి అమెరికా-ఇజ్రాయెల్‌తో నేరుగా తలపడితే ఇరాన్ ఏకాకిగా మిగిలిపోయే అవకాశం ఉంది. చైనా, రష్యా వంటి దేశాల నుంచి నైతిక మద్దతు ఉన్నా, ప్రస్తుత పరిస్థితుల్లో అవి యుద్ధంలో ప్రత్యక్షంగా దిగే అవకాశాలు తక్కువ. ఈ విషయాన్ని గ్రహించిన ఇరాన్, చమురు ధరల పెరుగుదల ద్వారా ప్రపంచ దేశాలను కూడా ఈ సంక్షోభంలోకి లాగుతోంది. ఇంధన ధరల మంటలతో ఇబ్బందులు పడే ఆయా దేశాలు, తమ ఆర్థిక వ్యవస్థలను రక్షించుకోవడానికి అమెరికాపై ఒత్తిడి పెంచేలా చేయడమే ఇరాన్ అసలు ఉద్దేశం.




## జర్నలిస్టులందరికీ గుర్తింపు కార్డులు

- డెస్క్, ఫీల్డ్ జర్నలిస్టులనే వ్యత్యాసం లేదు
- ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టు కాలనీ
- జర్నలిస్టుల సమస్యలపై సానుకూల స్పందన
- మహిళా జర్నలిస్టులతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
- సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటనలు

**ముద్ర, హైదరాబాద్ :**
హైదరాబాద్‌లో ఆదివారం తెలంగాణ సమాచార శాఖ ఆధ్వర్యంలో మహిళా జర్నలిస్టులతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గుర్తింపు కార్డులకు సంబంధించి ఎలాంటి అపోహలు వద్దని, అందరికి అన్ని అవకాశాలు ఉంటాయన్నారు. డెస్క్, ఫీల్డ్ జర్నలిస్టులకు అనే తేడా ఏమి లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారం కావాల్సి ఉందని, మహిళల చేతికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఇల్లు మహిళల చేతిలో ఉంటే గౌరవం పెరుగుతుందని అన్నారు. గతంలో లాగా చట్టం వల్ల ఎలాంటి సమస్య రాకుండా న్యాయవాదులతో మాట్లాడి చక్కటి పరిష్కారం కోసం ఆలోచిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు జర్నలిస్టులకు ఒక మంచి కాలనీ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మహిళా జర్నలిస్టుల పాత్ర సమాజంలో ఎంతో ముఖ్యమని అన్నారు. మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార శాఖ కమిషనర్ ప్రియాంకతో పాటు పలువురు అధికారులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
09.03.2026 సోమవారం, హైదరాబాద్



## 2024 – విజేత: భారత్ | రన్నరప్: దక్షిణాఫ్రికా

అమెరికా–వెస్టిండీస్‌లో జరిగిన టోర్నీలో భారత్ రెండోసారి టీ20 వరల్డ్ కప్ గెలిచింది. ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఉత్కంఠభరితమైన విజయం సాధించింది.



# అహ్మదాబాద్ లో విధ్వంసం.. టీమిండియా వరల్డ్ రికార్డు!

**అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ హాఫ్ సెంచరీలతో రన్ వరద**

**20 ఓవర్లలో 5 వికెట్లకు 255 పరుగులు – ఫైనల్లో టీమిండియా భారీ స్కోరు**

ముద్ర డెస్క్ :

టి20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్లో టీమిండియా ఆటగాళ్లు తమ విశ్వరూపం చూపించారు. ఓపెనర్లు అభిషేక్ శర్మ (52), సంజు శాంసన్(89), వన్ డౌన్ ప్లేయర్ ఇషాన్ కిషన్ (54) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. భారీగా పరుగులు చేసే క్రమంలో సూర్య డక్ అవుట్ కాగా.. హార్దిక్ 18 పరుగులతో విఫలమయ్యాడు.. చివర్లో శివంధూబే శివతాడవం చేశాడు. 8 బంతుల్లోనే 26పరుగులతో దంచికొట్టడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు చేసింది. వాస్తవానికి అహ్మదాబాద్ మైదానం టీమ్ ఇండియాకు అంత అనుకూలమైనది కాదు. ఈ మైదానంలో టీమిండియా 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్లో ఓడిపోయింది. ఇక ఇటీవల టి20 వరల్డ్ కప్ లో దక్షిణాఫ్రికా చేతిలో సూపర్ 8 మ్యాచ్ లో ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలో ఫైనల్ మ్యాచ్ నిర్వహణకు వేదికగా అహ్మదాబాద్ మైదానాన్ని నిర్ణయించడం పట్ల విమర్శలు వ్యక్తం అయ్యాయి. దీంతో పిచ్ ను మార్చేశారు. నల్ల మట్టితో నింపేశారు. దీంతో టీమిండియా బ్యాటర్లు పండగ చేసుకున్నారు. తద్వారా టీమ్ ఇండియా స్కోరు రాకెట్ వేగంతో దూసుకుపోయింది. ఓపెనర్లు తొలి వికెట్ కు 43 బంతుల్లో 98 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. సంజు శాంసన్ (89), అభిషేక్ శర్మ (52) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. ఇషాన్ కిషన్ కూడా హాఫ్ సెంచరీ చేశాడు. తొలి వికెట్ కు అభిషేక్ శర్మ, సంజు శాంసన్ 98 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేస్తే.. సంజు శాంసన్, కిషన్ రెండో వికెట్ కు 105 పరుగులు జోడించారు. అహ్మదాబాదులో వేగవంతంగా పరుగులు చేయడం ద్వారా టీమ్ ఇండియా ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టింది. టి20 వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచ్లలో టీమిండియా వేగవంతంగా వంద పరుగులు చేసింది. 7.2 ఓవర్ లోనే టీం ఇండియా ఈ ఘనత సాధించింది. ప్రస్తుత టి20 వరల్డ్ కప్ లో టోర్నీలో కోల్ కతా వేదికగా సౌత్ ఆఫ్రికా జరిగిన సెమీఫైనల్ మ్యాచ్లో న్యూజిలాండ్ జట్టు 7.5 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తిచేసింది. ఇదే టోర్నీలో టీమిండియా పై ఇంగ్లాండ్ 8.1 ఓవర్లలో 100 పరుగులు పూర్తిచేసింది. ఇంగ్లాండ్ పై టీమిండియా 8.3 ఓవర్లలో వంద పరుగులు చేసింది. ఇక ఇదే మ్యాచ్లో టీమిండియా పవర్ ప్లేలో 92 పరుగులు చేసింది. 2024లో బ్రిడ్జి టౌన్ వేదికగా ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో జరిగిన మ్యాచ్లో వెస్టిండీస్ ఒక వికెట్ నష్టానికి 92 పరుగులు చేసింది. 2014లో సైలెట్ వేదికగా ఐర్లాండ్ జట్టుతో జరిగిన మ్యాచ్లో నెదర్లాండ్ ఒక వికెట్ నష్టానికి 91 పరుగులు చేసింది. 2016లో సౌత్ ఆఫ్రికాపై ఇంగ్లాండ్ మూడు వికెట్ నష్టానికి 89 పరుగులు చేసింది. 2026 లో ఢిల్లీ వేదికగా నమిబియాతో జరిగిన మ్యాచ్లో టీమిండియా ఒక వికెట్ నష్టానికి 86 పరుగులు చేసింది. ఇక ప్రస్తుతం న్యూజిలాండ్ జట్టుతో జరుగుతున్న మ్యాచ్ లో ఫెర్గుసన్ చెత్త గణాంకాలు నమోదు చేశాడు. ఓకే ఓవర్ లో అతడు 26 పరుగులు ఇచ్చాడు. అయితే ఈ జాబితాలో ఇంగ్లాండ్ బౌలర్ బెన్ స్టోక్స్ మొదటి స్థానంలో ఉన్నాడు. 2016లో కోల్ కతా వేదికగా వెస్టిండీస్ జట్టుతో జరిగిన మ్యాచ్లో నాలుగు బంతుల్లో 24 పరుగులు ఇచ్చాడు. 2024లో బ్రిడ్జ్ టౌన్ వేదికగా సౌత్ ఆఫ్రికా తో జరిగిన మ్యాచ్ లో అక్షర్ పటేల్ 24 పరుగులు ఇచ్చాడు.




# టీమిండియాపై పాక్ క్రికెటర్ల ఆక్రోశం

టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు టీమిండియా చేరుకోవడంతో పాకిస్తాన్ మాజీ క్రికెటర్ల వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. అహ్మదాబాద్‌లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడనున్న నేపథ్యంలో కొందరు పాక్ మాజీ ఆటగాళ్లు చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. పాకిస్తాన్ మాజీ కెప్టెన్ ఇంజమామ్ ఉల్ హక్ మ్యాచ్‌కు ముందు పిచ్ పరిస్థితులను న్యూజిలాండ్ జట్టు జాగ్రత్తగా పరిశీలించాలని సూచించినట్లు సమాచారం. మరో మాజీ ఆటగాడు షాహిద్ ఆఫ్రిది, ఫైనల్‌లో భారత్ గెలిస్తే క్రికెట్‌కు నష్టం జరుగుతుందని వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. ఇక తన్వీర్ అహ్మద్ కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఫైనల్‌లో భారత్ గెలిస్తే తాను విచిత్రంగా స్పందిస్తానని చెప్పడంతో పాటు న్యూజిలాండ్ ఓపెనర్ ఫిన్ అలెన్ వేగంగా శతకం సాధిస్తాడని అంచనా వేశారు. ఈ వ్యాఖ్యలు అభిమానుల్లో చర్చకు దారితీశాయి.







# న్యూజిలాండ్‌భారత్ ఫైనల్.. టిక్కెట్ ధర ఎన్ని లక్షలంటే?

ముద్ర డెస్క్ :

టీ20 వరల్డ్‌కప్ 2026 ఫైనల్లో అహ్మదాబాద్ వేదికగా భారత్‌న్యూజిలాండ్ జట్లు తలపడేందుకు సిద్ధమయ్యాయి. ఈ తుది పోరును వీక్షించేందుకు అభిమానులు పెద్ద ఎత్తున నరేంద్ర మోడీ స్టేడియం వద్దకు చేరుకుంటున్నారు. అహ్మదాబాద్ ప్రస్తుతం 'క్రికెట్ ఫీవర్'తో ఊగిపోతోంది. ఇప్పటికే ఈ మ్యాచ్‌కు సంబంధించిన టిక్కెట్లు మొత్తం అమ్ముడుపోయాయి. బుక్‌మై షో యాప్ ద్వారా టికెట్లను విక్రయించారు. ప్రారంభ టిక్కెట్ ధర రూ. 2 వేలు కాగా.. గరిష్ట ధర రూ. 75000గా నిర్ణయించారు. అయితే టిక్కెట్లు దొరకని అభిమానులను ధళారులు టార్గెట్ చేస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌లో ఒక్కో టిక్కెట్‌ను రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి అనిల్ పటేల్ స్పందించారు. గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ ఎలాంటి ఫిజికల్ టిక్కెట్లను విక్రయించడం లేదని, కేవలం బుక్‌మైషో యాప్ ద్వారానే అధికారిక బుకింగ్స్ జరుగుతాయని స్పష్టం



చేశారు. అడ్డదారుల్లో టిక్కెట్లు కొనవద్దని ఆయన హెచ్చరించారు. కేవలం టిక్కెట్లే కాదు, అహ్మదాబాద్, గాంధీనగర్ నగరాల్లో హోటల్ గదుల ధరలు కూడా ఆకాశాన్నంటాయి. సాధారణంగా అహ్మదాబాద్ హోటల్లో ఒక రోజుకు ధర రూ. 4,000గా ఉంటుంది. కానీ ఇప్పుడు ఫైనల్ మ్యాచ్ క్రేజ్ కారణంగా ఈ ధరలు ఏకంగా 10 రెట్లు పెరిగాయి. అంటే ఒక్క రోజుకు రూ. 40,000 పైగా వసూలు చేస్తున్నారు.

# టి20 వరల్డ్ కప్ కోసం బీసీసీఐ భారీ ప్లాన్..


- ఫైనల్‌కు ముందు కీలక మార్పులు

టి20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌కు అహ్మదాబాద్ సిద్ధమైంది. మ్యాచ్ ప్రారంభానికి ముందే స్టేడియం అభిమానులతో కిక్కిరిసిపోయింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రికెట్ ప్రేమికులు ఫైనల్ పోరును ప్రత్యక్షంగా చూడాలని భారీగా తరలివచ్చారు. సూపర్-8 దశలో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి ఎదురైన తర్వాత టీమిండియా గట్టి కంబ్యాక్ ఇచ్చింది. జింబాబ్వే, వెస్టిండీస్, ఇంగ్లాండ్ జట్లపై వరుస విజయాలు సాధించి మరోసారి ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. టైటిల్ పోరులో న్యూజిలాండ్‌తో తలపడబోతోంది. వరుసగా రెండోసారి టీ20 వరల్డ్ కప్ సాధించాలని బీసీసీఐ కూడా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. ఫైనల్ మ్యాచ్‌కు ముందు టీమిండియా బస చేసే హోటల్‌ను కూడా మార్చినట్లు సమాచారం. గతంలో 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ సమయంలో, అలాగే ఈ టోర్నీలో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్ సమయంలో టీమిండియా అదే హోటల్‌లో ఉండగా ఓటమి ఎదురైంది. ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి వేరే హోటల్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. గణాంకాల పరంగా చూస్తే 2023 నుంచి ఇప్పటివరకు ఐసీసీ టోర్నీల్లో టీమిండియా మొత్తం 32 మ్యాచ్‌లు ఆడింది. అందులో 30 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. కేవలం రెండు మ్యాచ్‌ల్లో మాత్రమే ఓడిపోయింది. ఆ రెండు మ్యాచ్‌లు కూడా అహ్మదాబాద్ వేదికగా జరగడం విశేషం. ఇక ఫైనల్ మ్యాచ్ కోసం పిచ్‌ను ప్రత్యేకంగా సిద్ధం చేసినట్లు సమాచారం. మూడో నంబర్ పిచ్‌ను ఉపయోగిస్తున్నారని, దానిని నల్ల మట్టితో తయారు చేసినట్లు తెలుస్తోంది. బ్లాక్ సాయిల్ పిచ్‌పై బ్యాటింగ్‌కు అనుకూల పరిస్థితులు



# అహ్మదాబాద్‌లో అభిమానుల జేబులు ఖాళీ

టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ నేపథ్యంలో అహ్మదాబాద్‌లో అభిమానులపై ఖర్చుల భారం పెరిగింది. మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూడాలని దేశం నలుమూలల నుంచి అభిమానులు నగరానికి చేరుకుంటుండటంతో విమాన టికెట్లు, హోటల్ గదుల ధరలు భారీగా పెరిగాయి. సాధారణ రోజుల్లో ఢిల్లీ-అహ్మదాబాద్ విమాన టికెట్ ధర సుమారు రూ.3 వేల వరకు ఉండగా, ప్రస్తుతం అది రూ.15 వేల నుంచి రూ.17 వేల వరకు చేరినట్లు తెలుస్తోంది. హోటళ్లలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గతంలో రోజుకు



రూ.5 వేల వరకు ఉన్న గదుల అద్దె ఇప్పుడు రూ.20 వేల వరకూ వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఫైవ్ స్టార్ హోటళ్లలో డీలక్స్ గదుల ధరలు లక్షల్లోకి చేరడంతో పాటు అదనంగా జీఎస్టీ కూడా వసూలు చేస్తున్నారు. చిన్నచిన్న లాడ్జ్‌లు కూడా డిమాండ్‌ను బట్టి ధరలు పెంచినట్లు తెలుస్తోంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో భారీగా అభిమానులు తరలివస్తున్నారు. దీంతో నగరంలోని హోటళ్లు, రవాణా సేవలు పూర్తిగా బుక్ అయిపోయాయి. అభిమానుల రద్దీతో నగరం మొత్తం కిక్కిరిసిపోయిన పరిస్థితి కనిపిస్తోంది.

## ఫైనల్ మ్యాచ్‌కు మోడీ రాకపోవడమే మంచిదా?

# సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ

టి20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో భాగంగా అహ్మదాబాద్‌లో ఆదివారం న్యూజిలాండ్, టీమిండియా మధ్య టైటిల్ పోరు జరగబోతోంది. ఈ కీలక మ్యాచ్ నేపథ్యంలో సోషల్ మీడియాలో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ముఖ్యంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ హాజరు అంశం చర్చనీయాంశంగా మారింది. 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌కు కూడా నరేంద్ర మోడీ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఆ మ్యాచ్‌లో టీమిండియా ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. లీగ్ దశ నుంచి సెమీఫైనల్ వరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అద్భుతంగా ఆడిన భారత్ ఫైనల్‌లో మాత్రం విజయం సాధించలేకపోయింది. ఆ ఓటమి తర్వాత ఆటగాళ్లు తీవ్రంగా నిరాశకు గురయ్యారు. ఇప్పుడూ అహ్మదాబాద్ వేదికగా మరో ఫైనల్ మ్యాచ్ జరుగుతుండటంతో అభిమానులు సోషల్ మీడియాలో రకరకాలుగా స్పందిస్తున్నారు. 2023లో ప్రధాని మోడీ హాజరైనప్పుడు టీమిండియా వరల్డ్ కప్ కోల్పోయిందని, ఈసారి కూడా అలాంటి పరిస్థితి రాకూడదని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మరికొందరు మాత్రం మ్యాచ్ ఫలితం ఆటగాళ్ల ప్రదర్శనపైనే ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు.

ఇక టీ20 వరల్డ్ కప్ మ్యాచ్లలో న్యూజిలాండ్‌తో టీమిండియా ఇప్పటివరకు మూడుసార్లు తలపడింది. ఆ మూడు మ్యాచ్‌ల్లో కూడా భారత్ ఓడిపోయింది. దీంతో ఈసారి ఫైనల్ మ్యాచ్ మరింత ఉత్కంఠగా మారింది. ఒకవేళ న్యూజిలాండ్ గెలిస్తే ఆ జట్టు తొలిసారి టీ20 వరల్డ్ కప్ టైటిల్‌ను అందుకుంటుంది. మరోవైపు టీమిండియా విజయం సాధిస్తే వరుసగా రెండోసారి టీ20 వరల్డ్ కప్ గెలిచిన జట్టుగా నిలుస్తుంది. దీంతో ఈ ఫైనల్ మ్యాచ్‌పై ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల దృష్టి కేంద్రీకృతమైంది.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
09.03.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## పూల చీరలో మెరిసిన ఆశికా రంగనాథ్

కన్నడ నటి ఆశికా రంగనాథ్ తాజా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పూల డిజైన్ ఉన్న గాఢ వంగ రంగు చీరలో ఆమె స్టైలిష్‌గా కనిపించారు. సంప్రదాయ చీరకు మోడర్న్ టచ్ ఇచ్చేలా డిజైన్ చేసిన బ్లౌజ్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ లుక్‌ను బంగారు ఆభరణాలు మరింత హైలైట్ చేశాయి. చోకర్ హారం, పెద్ద చెవిపోగులు, గాజులు, ఉంగరం ధరించి ఆకట్టుకున్నారు. సాఫ్ట్ మేకప్, మెరిసే చర్మం, చక్కగా సర్దిన జుట్టుతో క్లాసిక్ లుక్‌లో కనిపించారు. వెచ్చని రంగుల బ్యాక్‌గ్రౌండ్, కాన్ఫిడెంట్ పోజులతో తీసుకున్న ఈ ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయానికి మోడర్న్ స్టైల్ జోడించిన ఈ లుక్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన వస్తోంది.

## లుక్ మార్చిన ఎన్టీఆర్



టాలీవుడ్ నటుడు ఎన్టీఆర్ కొత్త లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. బెంగళూరులోని కిమ్స్ ఆసుపత్రి స్పెషాలిటీ బ్లాక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఆయన కొత్త రూపంతో కనిపించారు. చెవికి రింగ్ పెట్టుకొని, భిన్నమైన స్టైల్‌లో కనిపించిన ఎన్టీఆర్ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారితీశాయి. దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న కొత్త సినిమా కోసం ఎన్టీఆర్ ఈ లుక్‌లోకి మారినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఆయన సరసన కన్నడ నటి రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాకు 'డ్రాగన్' అనే పేరును పరిశీలిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మే 20న ఈ సినిమా తొలి చూపును విడుదల చేయాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

## 'వారణాసి' ఓవర్సీస్ హక్కులకు భారీ ఆఫర్

సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'వారణాసి'. మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. విదేశాల్లో కూడా ఈ సినిమాకు మంచి క్రేజ్ కనిపిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓ డిస్ట్రిబ్యూషన్ సంస్థ భారతీయ భాషల ఓవర్సీస్ హక్కుల కోసం దాదాపు రూ.160 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై చిత్రబృందం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే, ఓవర్సీస్ హక్కులకుగాను ఇంత భారీ మొత్తాన్ని అందుకున్న తొలి భారతీయ సినిమాగా 'వారణాసి' రికార్డు సృష్టించే అవకాశం ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ గ్లింప్స్ ద్వారానే కథ నేపథ్యం, సినిమా స్థాయి ఏంటో దర్శకుడు రాజమౌళి ప్రేక్షకులకు చూపించారు. ఫాంటసీ, పౌరాణిక నేపథ్యంతో రూపొందుతున్న ఈ సినిమాలో మహేశ్‌బాబు రాముడి పాత్రలో కనిపించనున్నారు. మందాకిని పాత్రలో ప్రియాంకా చోప్రా నటిస్తుండగా, కుంభ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమార్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న విడుదల చేయాలని యోచిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 120కు పైగా దేశాల్లో సినిమాను విడుదల చేసేలా చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. అత్యధిక దేశాల్లో విడుదలయ్యే భారతీయ సినిమాగా 'వారణాసి' నిలిచే అవకాశముంది.



## మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన కరీనా, అనన్య, కళ్యాణి



బాలీవుడ్ నటి కరీనా కపూర్ ఖాన్ మరోసారి తన గ్లామర్‌తో ఆకట్టుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా సినీ రంగంలో కొనసాగుతున్న ఆమె తాజాగా 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' ప్రత్యేక సంచిక కవర్‌పై కనిపించారు. 'వుమెన్ ఇన్ ఎంటర్‌టైన్‌మెంట్ 2.0' పేరుతో రూపొందించిన ఈ ఫీచర్ కోసం యువ నటీమణులు అనన్య పాండే, కళ్యాణి ప్రియదర్శన్‌తో కలిసి ఫొటోషూట్‌లో పాల్గొన్నారు. తనకంటే చాలా చిన్న వయసు ఉన్న నటీమణులతో కలిసి కనిపించినప్పటికీ కరీనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్టైల్, కాన్ఫిడెన్స్ విషయంలో ఇప్పటికీ తాను ముందుంటానని ఈ ఫొటోషూట్ ద్వారా మరోసారి చూపించారు. ఈ ఫొటోషూట్‌లో ముగ్గురు నటీమణులు రెండు భిన్నమైన లుక్స్‌లో కనిపించారు. మొదటి లుక్‌లో ఎరుపు రంగు దుస్తుల్లో ఆకట్టుకున్నారు. కరీనా డీప్ నెక్ డిజైన్ ఉన్న సాటిన్ గౌన్ ధరించి ప్రత్యేకంగా మెరిశారు. అనన్య పాండే చిన్న స్కర్ట్, క్రాప్ షర్ట్‌లో మోడర్న్ స్టైల్‌లో కనిపించగా, కళ్యాణి ప్రియదర్శన్ కూడా స్టైలిష్ అవుట్‌ఫిట్‌తో ఆకట్టుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

## యాక్టింగ్ కంటే దర్శకత్వమే నాకు ఇష్టం: తరుణ్ భాస్కర్



టాలీవుడ్‌లో దర్శకుడిగా, నటుడిగా గుర్తింపు పొందిన తరుణ్ భాస్కర్ 'పెళ్లి చూపులు' సినిమాతో దర్శకుడిగా సినీ రంగంలోకి ప్రవేశించారు. తొలి సినిమాతోనే ప్రేక్షకుల ప్రశంసలు అందుకుని మంచి గుర్తింపు పొందారు. ఆ తర్వాత రూపొందించిన 'ఈ నగరానికి ఏమైంది', 'కీడా కోలా' చిత్రాలు కూడా మంచి ఆదరణ సాధించాయి. ఇటీవలి కాలంలో తరుణ్ భాస్కర్ నటుడిగానూ పలు సినిమాల్లో కనిపిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ప్రస్తుతం 'గాయపడిన సింహం' సినిమాలో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది. సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మాట్లాడిన తరుణ్ భాస్కర్, తనకు యాక్టింగ్ కంటే దర్శకత్వమే ఎక్కువగా సరిపోతుందని చెప్పారు. నటుడిగా పనిచేసేటప్పుడు నిర్ణయాలు ఇతరుల చేతుల్లో ఉంటాయని, కానీ దర్శకుడిగా ఉంటే సినిమా మొత్తం తన నియంత్రణలో ఉంటుందని తెలిపారు. అందుకే యాక్టింగ్ కంటే దర్శకత్వమే తనకు కరెక్ట్ అని పేర్కొన్నారు.

## బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు నిశ్చితార్థం

టాలీవుడ్ నటుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నిశ్చితార్థం ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య జరిగింది. హైదరాబాద్‌కు చెందిన కావ్యతో ఆయన నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి దర్శకుడు బోయపాటి శ్రీను, నటి సంయుక్తతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. సాయి శ్రీనివాస్‌కు కాబోయే భార్య కావ్యకు సినీ రంగంతో సంబంధం లేదని తెలిసింది. కొంతకాలంగా వీరిద్దరూ పరస్పరం పరిచయం కొనసాగిస్తూ వచ్చారని సినీ వర్గాలు చెబుతున్నాయి. నిర్మాత బెల్లంకొండ సురేశ్ కుమారుడైన సాయి శ్రీనివాస్ 'అల్లుడు శీను' సినిమాతో టాలీవుడ్‌లోకి ప్రవేశించారు. తర్వాత 'జయ జానకి నాయక', 'రాక్షసుడు', 'కిష్కింధపురి' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం 'హైందవ', 'టైసన్ నాయుడు' సినిమాల్లో నటిస్తున్నారు.



## ఓటీటీలోకి రానున్న విశ్వక్ సేన్ 'ఫంకీ'

టాలీవుడ్ యువ నటుడు విశ్వక్ సేన్ నటించిన 'ఫంకీ' సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కాయాదు లోహర్ కథానాయికగా నటించిన ఈ చిత్రానికి 'జాతి రత్నాలు' దర్శకుడు అనుదీప్ కేవి దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 13న విడుదలైన ఈ సినిమా మంచి అంచనాల మధ్య థియేటర్లలోకి వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో స్పందన పొందలేదు. ప్రేక్షకుల నుంచి ప్రతికూల స్పందన రావడంతో ఈ చిత్రం పెద్దగా విజయాన్ని సాధించలేకపోయింది. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ వేదికపై విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ హక్కులను నెట్ ఫ్లిక్స్ సంస్థ దక్కించుకుంది. మార్చి 13 నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్ చేయనున్నట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. థియేటర్లలో ఆశించిన ఫలితం రాకపోయిన ఈ చిత్రం ఓటీటీ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి. దర్శకుడు అనుదీప్ కేవి 'పిట్టగోడ'తో కెరీర్ ప్రారంభించి 'జాతి రత్నాలు'తో భారీ విజయాన్ని అందుకున్నారు. ఆ తర్వాత వచ్చిన సినిమాలు మాత్రం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. అదే విధంగా విశ్వక్ సేన్ కూడా కెరీర్ ప్రారంభంలో వరుస విజయాలు అందుకున్నప్పటికీ ఇటీవలి కాలంలో పరాజయాలు ఎదుర్కొంటున్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com